

అనంతరాజుపేట ఉద్యాన యూనివర్సిటీ వద్ద అధికారులతో మాట్లాడుతున్న ఎస్పీ కృష్ణారావు

ఈవీఎం స్ట్రాంగ్ రూంకు భారీ భద్రత

- ఎన్నికలను పటిష్ఠంగా నిర్వహిస్తాం
- ఎస్పీ కృష్ణారావు

రైల్వేకోడూరు, మార్చి 11: ఈవీఎం స్ట్రాంగ్ రూంకు భారీ భద్రత కల్పిస్తామని, ఎన్నికలు పటిష్ఠంగా నిర్వహిస్తామని ఎస్పీ కృష్ణారావు తెలిపారు. సోమవారం రైల్వేకోడూరు మండలం లోని అనంతరాజుపేట ఉద్యాన యూనివర్సిటీలో ఈవీఎం స్ట్రాంగ్ రూంను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు జరుగుతున్నాయని తెలిపారు. జిల్లాలో గుర్తించిన అన్ని సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి, నిఘా పెంచుతామన్నారు. ఓటర్లు తమ ఓటును ప్రశాంతంగా వేసుకునేందుకు వీలు కల్పిస్తామన్నారు. ఎక్కడైనా ఇబ్బందులు ఉంటే ప్రజలు తమ దృష్టికి తెస్తే వాటిని సరిదిద్దుతామని తెలిపారు. పోలింగ్ కేంద్రం వద్ద ఎలాంటి గొడవలు లేకుండా చేస్తామని, గొడవలు సృష్టించే వ్యక్తులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఓటింగ్ ప్రశాంతంగా నిర్వహించడమే లక్ష్యంగా పోలీసు శాఖ పనిచేస్తుందన్నారు. పోలీసులు ప్రజలకు అందుబాటులో ఉంటారన్నారు. ఓటర్లు తమ ఓటును నిర్భయంగా వేసుకునేందుకు వీలు కల్పిస్తామన్నారు. ఓటర్లను భయభ్రాంతులకు గురిచేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. స్ట్రాంగ్ రూములు ఎలా ఉన్నాయి, బయట వ్యక్తుల ప్రవేశం ఏమైనా ఉంటుందా, ఎలా భద్రత కల్పించాలి, నియోజకవర్గంలోని అన్ని రూట్లకు ఈవీఎంలు ఎలా చేరాలి అనే అంశాలపై అధికారులతో చర్చించారు. ఆయన వెంట రైల్వేకోడూరు తహసీల్దార్ శివరాముడు, రాజంపేట డీఎస్పీ చైతన్య, రైల్వేకోడూరు సీఐ టి.బాబు, మండల సర్వేయర్ సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ గురుకుల కళాశాల, పాఠశాలల్లో అడ్మిషన్లకు నోటిఫికేషన్ విడుదల

కలికిరి, మార్చి 11: జిల్లాలోని జ్యోతిభాపూలే బీసీ గురుకుల జూనియర్ కళాశాల, పాఠశాలల్లో 2024-25 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల చేశారు. గురుకుల జూనియర్ కళాశాలలో జూనియర్ ఇంటర్మీడియట్, పాఠశాలల్లో 5వ తరగతిలో ప్రవేశాలకు పరీక్షల తేదీని నిర్ణయించినట్లు జిల్లా కన్వీనర్, కలికిరి బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ వై.సోమశేఖర్ ప్రకటించారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు ఏప్రిల్ 13న, పాఠశాలల్లో 5వ తరగతి ప్రవేశాలకు ఏప్రిల్ 24న ప్రవేశ పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ రెండు తరగతుల ప్రవేశాల కోసం ఈనెల 31వ తేదీ లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు పంపుకోవాలని కోరారు. 5వ తరగతిలో బాలికల కోసం కలికిరి, పీలేరు, నందలూరు గురుకుల పాఠశాలల్లో ఒక్కో దాంట్లో 80 సీట్ల వంతున కేటాయించినట్లు వివరించారు. బాలురకు సంబంధించి తంబళ్లపల్లె (అంగళ్ళు) పాఠశాలలో 40 సీట్లు కేటాయించామన్నారు. అదేవిధంగా నందలూరు గురుకుల కళాశాలలో బాలికలకు మాత్రం ఎంపీసీలో 60, బైపీసీలో 40, సీఈసీలో 40 సీట్ల వంతున అందుబాటులో ఉన్నాయని కన్వీనరు తెలిపారు. ఇతర వివరాలకు కన్వీనరు, ప్రిన్సిపాల్, కలికిరి గురుకుల పాఠశాల 90007 15637 నెంబరులోగానీ, నందలూరు బాలికల కళాశాల ప్రిన్సిపాల్‌ను 98665 59605లోగానీ, లేదా ఆయా స్థానిక గురుకుల పాఠశాలల ప్రిన్సిపాల్‌ను గానీ సంప్రదించాలని లేదా వెబ్‌సైట్‌లో కూడా వివరాలు పొందవచ్చని తెలిపారు.

కలసి పని చేద్దాం.. టీడీపీని గెలిపిద్దాం

- చేయి, చేయి కలిపిన ముక్కా, కస్తూరి



చేయి, చేయి కలిపిన ముక్కా రూపానందరెడ్డి, కస్తూరి విశ్వనాథనాయుడు

రైల్వేకోడూరు, మార్చి 11: టీడీపీ నూతన నియోజకవర్గ ఇన్‌చార్జ్ ముక్కా రూపానందరెడ్డి తిరుపతిలోని కస్తూరి నివాసంలో సోమవారం సాయంత్రం ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి రైల్వేకోడూరు రాజకీయాలపై చర్చించారు. కలసి పనిచేసి టీడీపీ అభ్యర్థిని గెలిపించి చంద్రబాబుకు బహుమతిగా ఇస్తామని వారిద్దరూ చేయి చేయి కలిపారు. ఈ సందర్భంగా ముక్కా రూపానందరెడ్డి మాట్లాడుతూ రైల్వేకోడూరులో టీడీపీ, జనసేన, బీజేపీ పొత్తుతో అభ్యర్థి విజయానికి ఢోకా ఉండదన్నారు. ప్రజల ఆశీస్సులతో మంచి మెజార్టీతో తమ అభ్యర్థి విజయం సాధిస్తారన్నారు. చంద్రబాబును ముఖ్యమంత్రిగా చూడాలని ప్రజలు వేయి కళ్లతో ఎదురు చూస్తున్నారన్నారు. త్వరలో టీడీపీలో భారీగా చేరికలు ఉంటాయని, నియోజకవర్గంలో టీడీపీకి పూర్వవైభవం తీసుకుని వస్తామని, వైసీపీకి కోలుకోలేని దెబ్బ పడుతుందన్నారు. నియోజకవర్గంలో ప్రజల ఆశీస్సులు టీడీపీకే ఉన్నాయని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రముఖ పారిశ్రామికవేత్త మాచినేని విశ్వేశ్వరనాయుడు, సీనియర్ నాయకులు గడికోట సుబ్బరాయుడు, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి రంజాన్ మాసం ప్రారంభం

- ప్రార్థనల కోసం ముస్తాబైన మసీదులు
- తరావీహ్ నమాజులు ప్రారంభం



పీలేరులోని మదీనా మసీదు

పీలేరు, మార్చి 11: ఇస్లాం మతంలో ఎంతో ప్రాముఖ్యత కలిగిన రంజాన్ మాసపు ఉపవాసాలు మంగళవారం నుంచి ప్రారంభమవుతాయని పీలేరు జామియా మసీదు ఇమామ్ ముఫ్తీ అబ్దుల్లా తెలిపారు. జిల్లాలో నెలవంక కనిపించకపోయినప్పటికీ విజయవాడ, గుంటూరు నగరాల్లో దర్శనం ఇచ్చిందని, అంతేకాకుండా గల్ఫ్ దేశాలైన సౌదీ అరేబియా, కువైత్‌లలో సోమవారం తొలి ఉపవాసం ప్రారంభమైనందున జిల్లాలోనూ మంగళవారం నుంచి ఉపవాసాలు ప్రారంభమవుతాయని ఆయన వివరించారు. అందుకు సన్నద్ధంగా సోమవారం రాత్రి ఇషా నమాజు తరువాత తరావీహ్ నమాజులు ప్రారంభమయ్యాయి. రంజాన్ నెల సందర్భంగా జిల్లాలో ముస్లింలు అధికంగా ఉండే పీలేరు, రాయచోటి, మదనపల్లె, బి.కొత్తకోట, ములకలచెరువు, రాజంపేట ప్రాంతాల్లోని మసీదుల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. రంజాన్ మాసానికి ప్రత్యేకమైన ఉదయపు సెహరీ, సాయంత్రం ఇఫ్తార్ కోసం అన్ని మసీదుల్లో ఆయా మసీదు కమిటీ నిర్వాహకులు, యువజన సంఘాలు ఏర్పాట్లు పూర్తి చేశాయి. అందులో భాగంగా పీలేరు మల్లెల గ్రౌండ్స్‌లో ఉన్న అక్సా మసీదులో ప్రముఖ రియల్ ఎస్టేట్ వ్యాపారి అతిఖా షఫీ తన సొంత నిధులతో రంజాన్ మాసం పూర్తయ్యే వరకు ఉచితంగా సెహరీ ఏర్పాటు చేశారు. రంజాన్ అనగానే అందరికీ గుర్తుకు వచ్చే హైదరాబాద్ హలీంను పీలేరు పట్టణ వాసులకు రుచి చూపేందుకు చాలా మంది స్థానిక హోటళ్ల నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు.

నదులను తవ్వేస్తున్నారు

- బాహుదా, పింఛా నదుల నుంచి ఇసుక అక్రమ రవాణా
- అడుగంటుతున్న భూగర్భజలాలు
- ఎండిపోతున్న పంటలు
- పట్టించుకోని అధికారులు

అధికార పార్టీలోని కొందరికి ఇసుక ప్రముఖ ఆదాయ వనరుగా మారింది. ఇసుక అక్రమ రవాణా చేస్తూ కోట్లాది రూపాయలకు పడగలెత్తుతున్నారు. ఇదంతా అధికారులకు తెలిసినా అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గి చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. బాహుదా, పింఛా నదుల నుంచి అక్రమార్కులు భారీగా ఇసుక తరలిస్తున్నారు. అధికార పార్టీలోని కొందరు మీరు ఇసుక ఎంతైనా తోలుకోండి.. మీ వెంట మేమున్నామంటూ భరోసా ఇవ్వడంతో ఇసుకాసురులు రెచ్చిపోయి రాత్రిపూట ఇష్టారాజ్యంగా ఇసుకను తరలిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.



పింఛా నది నుంచి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్



బాహుదాలో ట్రాక్టర్‌కు ఇసుక నింపుతున్న కూలీలు

సుండుపల్లె, మార్చి 11: ఇసుక అక్రమ రవాణా కోసం బాహుదా, పింఛా నదులను అధికార పార్టీ నాయకులు తవ్వేస్తున్నారు. బాహుదా నది సుండుపల్లె మండలంలోని తిమ్మసముద్రం, ఎర్రమనేనిపాలెం, సుండుపల్లె, రాయవరం, మడితాడు, పెద్దినేనికాలువ గ్రామ పంచాయతీల రైతులకు, అలాగే పింఛా ప్రాజెక్టు ముడుంపాడు, మాచిరెడ్డిగారిపల్లె, పెద్దినేనికాలువ, రాయవరం గ్రామ పంచాయతీల రైతులకు వరప్రసాదిని లాంటివి. బాహుదా నదిలో ఇసుక సంపూర్ణంగా ఉండడం వలన పరిసర ప్రాంతాల్లోని రైతులకు కరువు కాటకాల నుంచి రక్షణగా ఉంటుంది. గతంలో మండల ప్రజల గృహ నిర్మాణాల కోసం లేదా ప్రభుత్వ భవనాలు, రోడ్లు వేయడం కోసం నదిలోని ఇసుకను వినియోగించుకునే వారు. అయితే వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ప్రభుత్వమే ఇసుక రవాణాను ప్రైవేట్ సంస్థలకు అప్పగించడంతో వారు భారీగా ఇసుకను అమ్ముకున్నారు. దీంతో బాహుదాలో రాను రాను ఇసుక శాతం తగ్గిపోతోంది. కాగా మండల కేంద్రానికి కూతవేటు దూరంలో సుండుపల్లె పోలీస్‌స్టేషన్ సమీపంలోని అగ్రహారం గుట్ట దిగువభాగాన బాహుదా నదిలో ఎలాంటి అనుమతులు లేకున్నా గత ఏడాది నుంచి ఇసుక అక్రమ రవాణా జరుగుతూనే ఉంది. ఇదంతా తెలిసినా అధికారులెవ్వరూ పట్టించుకోలేదనే విమర్శలున్నాయి. అధికార పార్టీ నాయకుల ఆదాయ వనరుగా బాహుదా మారిందన్న విమర్శలు ఉన్నాయి. అధికార పార్టీ నాయకులు ఇసుక అక్రమ రవాణా చేస్తే అధికారులు సైతం చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. సామాన్య ప్రజలు జగనన్న కాలనీ లేదా సొంత ఇంటి నిర్మాణానికి వినియోగిస్తే పట్టుకుని కేసులు బనాయించే అధికారులు అధికార పార్టీ నాయకులపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదన్న ప్రజలు విమర్శిస్తున్నారు. ప్రతిరోజు పింఛా నది నుంచి రొంపిచర్లకు ఇసుక తరలిపోతోంది. ఇసుక ట్రాక్టర్లను పట్టుకుని తూతూ మంత్రంగా జరిమానా విధించి అధికార పార్టీ నేతల ఒత్తిళ్లతో వదిలి వేయడం వలన ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోంది.

అడుగంటుతున్న భూగర్భజలాలు

బాహుదా, పింఛా నది పరీవాహక ప్రాంతాల్లోని వ్యవసాయ బోరు బావుల్లో నీటి శాతం గణనీయంగా తగ్గిపోయింది. బాహుదా నదికి ఇరువైపులా రైతులు వరి, వేరుశనగ పంటలతో పాటు పలు రకాల పండ్ల తోటలు, కూరగాయల తోటలను సాగు చేస్తున్నారు. మార్చి గడవకముందే బోరు బావుల్లో నీరు తగ్గిపోయి పంటలు ఎండిపోతున్నాయి. దీంతో పంటలను కాపాడుకునేందుకు కొంతమంది రైతులు నదిలో ఫిల్టర్‌పాయింట్లు వేసుకుని పంటలను కాపాడుకుంటున్నారు. ఇప్పుడే ఇలా ఉంటే ఇక ఏప్రిల్, మే నెలల్లో మరింత తాగు, సాగునీటి సమస్య ఎదుర్కోవాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి, పగలు అనే తేడా లేకుండా ఇసుకను తరలించేస్తే రాను రాను బోర్లలో నీరు వచ్చే పరిస్థితి లేదని వాపోతున్నారు. అధికార పార్టీ నాయకులకు అక్రమ రవాణాకు అడ్డుకట్టే లేకుండా పోయింది. ఎక్కడ పడితే అక్కడ వారికి ఎక్కడ వీలుగా ఉంటుందో అక్కడి నుంచి ఇసుకను తరలించి అమ్ముకుంటున్నారని స్థానిక రైతులు చెబుతున్నారు. బాహుదా, పింఛా నదుల్లో ఇసుక రవాణాను అరికట్టి పంట పొలాలు ఎండిపోకుండా చూడాలని రైతులు కోరుతున్నారు.

వసూల్ రాజాలు

ఇసుక అక్రమ రవాణాలో అధికార పార్టీ నాయకులు, ట్రాక్టర్ యజమానులతో పాటు కొంతమంది వసూల్ రాజాల పాత్ర ఉందని జోరుగా విమర్శలు వస్తున్నాయి. రాత్రిపూట అధికార పార్టీకి చెందిన కొంతమందికి మాత్రమే ఇష్టారాజ్యంగా అనుమతులు ఇవ్వడం వెనుక మామూళ్లు భారీగా చేతులు మారుతున్నట్లు విమర్శలు వస్తున్నాయి. ఈ వ్యవహారం అంతా సుమారు ఏడాది నుంచి జరుగుతున్నట్లు అధికార పార్టీలోని ఓ వర్గం జోరుగా విమర్శిస్తోంది. కొంతమంది నాయకులు రాత్రిపూట ఇసుకకు అనుమతులు ఇప్పిస్తామని ఒక ట్రిప్పు ఇసుక తోలుకుంటే 400 నుంచి 500 రూపాయల వరకు కమీషన్ వసూలు చేస్తున్నారని, అందులో అధికారులకు కూడా వాటా ఉందన్న ఆరోపణలు ఉన్నాయి. రాత్రంతా ఇసుక తోలుకోండి మాదే బాధ్యత అంతా మేము చూసుకుంటాం అని భరోసా కల్పించి ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారని విమర్శలు ఉన్నాయి.

ఇసుక తరలిస్తే చర్యలు తీసుకుంటాము..

ఇసుకకు ఎవరు అనుమతులు ఇస్తున్నారు. ఎక్కడ నుంచి తరలిస్తున్నారు అనేది తెలుసుకుని చర్యలు తీసుకుంటాను. దాని కోసం వీఆర్‌ఏలను ఏర్పాటు చేశాము. ఇసుక తరలించేందుకు ఎవరు స్లిప్పులు ఇస్తున్నారు, ఎక్కడి నుంచి తరలిస్తున్నారు అన్న దానిపై విచారించి అక్రమార్కులపై చర్యలు తీసుకుంటాము.

- జరీనా, తహసీల్దార్, సుండుపల్లె

ఇసుక తరలింపు మా కుటుంబానికి శాపం



ప్రభుత్వం ఆదాయం కోసం రాయవరం గ్రామ పంచాయతీ కావలిపల్లి సమీపంలో ఇసుక రీచ్ ఏర్పాటు చేసింది. ఈ రీచ్ మా ఊరికి సమీపంలో ఉంది. నదిలో ఇసుక తరలించడంతో ఏర్పడ్డ నీటి గుంత దగ్గరికి నా కుమారుడు వెళ్లి పడిపోయాడు. ఈత రాకపోవడం వలన నీరు ఊపిరితిత్తుల్లోకి పోయి కోమాలోకి పోయాడు. లక్షలాది రూపాయలు ఖర్చు పెట్టి వైద్యం చేయించినా ప్రయోజనం లేకుండా పోయింది. కోమా నుంచి బయటికి వచ్చినా మైండ్ సరిగ్గా పనిచేయడం లేదు. డిగ్రీ చదువుతున్న నా కుమారుడు ఈ విధంగా అయిపోవడం మా కుటుంబానికి శాపంగా మారింది. మా పాపం ఈ ప్రభుత్వానికి తగులుకుంటుంది. అప్పట్లో ఇసుక రీచ్‌లో ఇసుక తరలించిన యజమానులు మొత్తం వైద్యం ఖర్చు మాదే అని చెప్పినా ఎటువంటి సహాయం చేయలేదు. ఒకసారి వైద్యం కోసం ఆసుపత్రికి వెళితే పది వేలకుపైగా బిల్లు వేస్తున్నారు. మా కుటుంబాన్ని ఆదుకోండి.

- గోవిందు సురేశ్,
బాధిత కుటుంబ యజమాని, కావలిపల్లి

సామాన్యులకు ఇసుక దొరకదు..



సుండుపల్లె మండలంలో సామాన్య ప్రజలకు ఇసుక దొరకదు. ఇసుకను అధికార పార్టీ నాయకులు అక్రమంగా తరలించి అమ్ముకుంటున్నారు. కొంతమందికి మాత్రమే ఇసుక తరలించుకునేందుకు అధికారులు అనుమతులు ఇస్తున్నారు. ఒక ట్రిప్పు ఇసుక రూ.3 వేలకు అమ్ముకుంటున్నారు. ప్రజలకు ఇసుక ఉచితంగా అందిస్తే సామాన్యులకు ఎంతో మేలు జరుగుతుంది.

- రామశ్రీనివాస్, జనసేన నాయకుడు

యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా

- మల్లెల సమీపంలోని వాగులో ఇసుకను తోడేస్తున్న వైనం

పెద్దతిప్పసముద్రం మార్చి 11: తంబళ్లపల్లె నియోజకవర్గంలోని పీటీఎం మండలంలో అధికార పార్టీ నాయకులు ఇసుకను అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. పెద్దతిప్పసముద్రం మండలంలో గతంలో టి.సదుం పంచాయతీ రామాపురం వద్ద ఇసుక రీచ్ నిలిపేయడంతో ఇసుకాసురులు స్థానికంగా ఉన్న వాగులు, వంకల్లో నుంచి నుంచి ఇసుకను అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. మల్లెల సమీపంలోని అంకిరెడ్డిపల్లె వద్ద వాగుకు అనుకుని ఉన్న భూములను అక్రమార్కులు లీజు పేరుతో రైతులకు కొంచెం డబ్బులు ఇచ్చి తమ ఇష్టానుసారం తోడేసి సొమ్ము చేసుకుంటున్నారు. జగనన్న ఇళ్ల పేరుతో అక్రమార్కులు పీటీఎం మండలం నుంచి బి.కొత్తకోటకు తరలించుకుపోతున్నారు. అధికార పార్టీ నాయకుల అండదండలతో ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా కొనసాగుతోందన్న ఆరోపణలు ఉన్నాయి. జగనన్న ఇళ్లకు ఇసుకను అతి తక్కువ ధరకు తోలుతున్నామని చెబుతున్న ఇసుకాసురులు ఒక్క లోడు ఇసుకను 3 వేల నుంచి 4 వేల వరకు విక్రయిస్తున్నారు. ఎవరైనా అధికారులు వస్తే ఇసుకాసురులు ఎమ్మెల్యే పేరు చెప్పి అక్రమంగా తరలిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మల్లెల సమీపంలోని అంకిరెడ్డిపల్లె సమీపంలోని సంపతికోట వాగులో ఇసుకాసురులు ఇష్టారాజ్యంగా ఇసుకను తవ్వేయడంతో పెద్ద గోతులు ఏర్పడ్డాయి. దీంతో వాగు పక్కనున్న రైతులు తమ బోర్లలో నీరు అడుగంటిపోతున్నాయని, వాగులో గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా ఉన్నాయని వాపోతున్నారు. సంబంధిత అధికారులు ఇసుక అక్రమ రవాణాపై దృష్టి సారించాలని సమీప గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



అంకిరెడ్డిపల్లె వద్ద వాగులో ఇసుకను అక్రమంగా ట్రాక్టర్లకు లోడు చేస్తున్న దృశ్యం

గంగమ్మ తల్లీ.. కరుణించవమ్మా..

- భక్తులతో కిటకిటలాడిన గంగజాతర
- అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు

లక్కిరెడ్డిపల్లె, మార్చి 11; కరుణించవమ్మా.. కాపాడవమ్మా గంగమ్మతల్లి... అంటూ అమ్మవారికి భక్తులు బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. గంగమ్మ జాతరకు భక్తులు పోటెత్తారు. మండలంలోని అనంతపురంలో సోమవారం గంగమ్మ జాతర అత్యంత వైభవంగా జరిగింది. వేకువజామునే చాగలగుట్టపల్లె నుంచి అమ్మవారు డప్పులు, వాయిద్యాల మధ్య జాతరకు బయలుదేరినప్పుడు చాగలగుట్టపల్లె నుంచి రోడ్డు పొడవునా అమ్మవారికి జంతువులను బలి ఇచ్చారు. అమ్మవారు జాతర ఆలయంలోకి ప్రవేశించగానే చెల్లు వంశీయులు అమ్మవారికి స్వాగతం పలికి మొదటి పూజ ప్రారంభించారు. అనంతరం చౌటపల్లెకు చెందిన రామయ్య గారి సమరసింహారెడ్డి కుటుంబీకులు అమ్మవారికి సిద్దలకూడు ప్రసాదం సమర్పించగా, ఈడిగపల్లెకు చెందిన ఆడిగ వంశీయులు అమ్మవారికి కల్లు సమర్పించారు. సిద్దలకూడు, కల్లును సంతానం కోసం అమ్మవారి ముందు వరపడిన మహిళలకు ప్రసాదంగా అందచేశారు. అనంతరం అమ్మవారికి సంప్రదాయబద్ధంగా మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్‌రెడ్డి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆయన వెంట రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి, శాసనమండలి మాజీ డిప్యూటీ చైర్మన్ సతీశ్‌రెడ్డి, ఎమ్మెల్సీ రామచంద్రయ్య, ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి, పలువురు అధికారులు అమ్మవారిని దర్శించుకున్నారు. జాతర ప్రాంగణమంతా భక్తులతో కిటకిటలాడింది. జాతరకు లక్షల సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీసీ కెమరాలు ఏర్పాటు చేశారు. రాయచోటి డీఎస్పీ మహబూబ్‌బాషా గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ, జర్నలిస్టులు, ఉపాధ్యాయులు మజ్జిగ, నీళ్ల ప్యాకెట్లు పంపిణీ చేశారు. రాత్రి అమ్మవారి ఆలయం చుట్టూ బాణాసంచా పేలుళ్లతో కుంకుమబండ్లు, చాందినీబండ్లతో అమ్మవారి ఊరేగింపు వైభవంగా జరిగింది. ఉదయం బాలయ్యగారిపల్లెకు చెందిన గంగిరెడ్డి ఆధ్వర్యంలో 10 జతల ఎడ్లతో బండలాగుడు పోటీలు నిర్వహించారు. మొదటి బహుమతి 60వేలు, ద్వితీయ బహుమతి 50 వేలు, తృతీయ బహుమతి 40 వేల రూపాయలు అందజేశారు. ఈ ఏడాది చాందినీ బండ్లు ఎక్కువగా వచ్చాయి. జబర్దస్త్ బృందం చేసిన హాస్య కార్యక్రమాలు అందరినీ అలరించాయి. రేలారే రేలా కార్యక్రమాలు, చెక్కభజనలు, హరికథలు ఆకట్టుకున్నాయి. ఆలయ ఈవో రవీంద్రరాజు, ఆలయ కమిటీ చైర్మన్ మురికినాటి రెడ్డెయ్యకమిటీ సభ్యులు జాతరలో అన్ని ఏర్పాట్లు చేశారు.



సంతానం కోసం అమ్మవారి ముందు వరపడిన మహిళలు



ప్రత్యేక అలంకరణలో గంగమ్మతల్లి



బోనం తీసుకెళుతున్న మహిళ



అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు



బండలాగుడు పోటీలో పాల్గొన్న ఎద్దు

వరికి నీరు అందేనా...?



ఈ రైతు పేరు సోమశెట్టి తిరుమలయ్య. దమ్మనపల్లెకు చెందిన ఈయన తన కుమారులతో కలిసి మొత్తం పది ఎకరాల్లో వరి సాగు చేశాడు. చెరువులో నీరు తగ్గిపోవడంతో రెండు ఎకరాల్లో మాత్రమే ఫలసాయం వచ్చే పరిస్థితి ఉందని.. మరో 8 ఎకరాలకు పూర్తిస్థాయిలో నీళ్లు అందుతా యో లేదోనన్న సందేహం వ్యక్తం చేశారు.

- చెరువులో అడుగంటిన నీళ్లు
- ఆందోళనలో ఆయకట్టు రైతులు
- వ్యవసాయ బోర్లు ఉన్న రైతులను ఆశ్రయించి..
- తడికి రూ.వెయ్యి వంతున చెల్లిస్తున్న వైనం

పోరుమామిళ్ల, మార్చి 11: వరి ధాన్యానికి మంచి ధరలు ఉన్నాయి... చెరువులో నీరు సమృద్ధిగా ఉంది.. వరి పైరు సాగు చేసుకుంటే... కష్టాల నుంచి గట్టెక్కవచ్చని అప్పులు చేసి పంట సాగు చేశారు కొందరు రైతులు. ప్రస్తుతం పంట కొంత మేర కోత దశలో ఉండగా.. మరికొంత మరో రెండు నెలలకు పంట చేతికి వచ్చే పరిస్థితి ఉంది. ఇలాంటి సమయంలో చెరువులో ఉన్న నీరు అడుగంటి పోవడంతో రైతుల్లో ఆందోళన మొదలైంది. పంట చేతికి అందుతుందా లేదా సందిగ్ధంలో కొట్టుమిట్టాడుతున్నారు.

ఈ ఏడాది రబీ సీజన్‌లో పోరుమామిళ్ల చెరువు కింద దమ్మనపల్లె, కట్టకిందపల్లె, సుంకేసులపల్లె, మార్కాపురం, మల్లకతవ కింద భాగాన దాదాపు వెయ్యి ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. ఇందులో కొంత మేర పైరు కోత దశకు చేరుకుంది. 400 ఎకరాలలో మరో రెండు నెలలు నీరందించాల్సి ఉంది. ఈ దశలో పోరుమామిళ్ల చెరువు నీటిని రంగసముద్రం, రెడ్డికొట్టాలకు మళ్లించడంతో నీటి మట్టం బాగా తగ్గిపోయింది. దీంతో రైతుల్లో అలజడి మొదలైంది. ఇప్పటికే కొందరు చెరువులోని గుంతల్లో ఉన్న నీటిని ఇంజన్లు పెట్టుకుని పొలాలకు మళ్లించుకుంటున్నారు. మరికొందరు చెరువులో ఊట నీరు రాకపోతుందా.. అందరి పొలాలతో పాటు మా పొలాలకు నీళ్లు పారకపోతాయా అన్న ఆశతో ఉన్నారు. అయితే మరికొందరు రైతులు వరిపైరును కాపాడుకునేందుకు వ్యవసాయ బోర్లు ఉన్న రైతులను ఆశ్రయించి నీటి తడులు అందిస్తున్నారు. ఎకరాకు ఒక్కో తడికి రూ.వెయ్యి చొప్పున చెల్లించి నీళ్లు కట్టుకుంటున్నారు. ఇక ఇప్పటికే ఎకరాకు దాదాపు రూ.25వేల వరకు పెట్టుబడి పెటామని చెబుతున్నారు. ఇప్పుడు ఒక్కో ఎకరాకు తడికి వెయ్యి వంతున చెల్లించాల్సి ఉంటుందని.. అది కూడా వారి కనికరిస్తే తప్ప తమపొలాలకు నీరందని పరిస్థితి ఉందని వాపోతున్నారు. పైరు చేతికి వచ్చేంత వరకు అధికారులు కానీ నాయకులు కానీ సహకరించి నీరు విడుదల చేస్తే తమ పంటను కాపాడుకోవడానికి అవకాశం ఉంటుందని చెబుతున్నారు. ఈ విషయమై వ్యవసాయాధికారి వరహరికుమార్‌ను వివరణ కోరగా.. వరి సాగు చేసిన రైతులకు చెరువు నీరు సరిపోతుందని, ఖరీఫ్‌కు మాత్రం చెప్పలేమన్నారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఈ రబీలో వరికి కావలసిన నీరు లభిస్తుందన్నారు.



పోరుమామిళ్ల చెరువు కింద సాగులో ఉన్న వరి





పోరుమామిళ్ల చెరువులో చిన్నతూము వద్ద అడుగంటిన జలాలు, చెరువులోని గుంతల నుంచి మోటర్ల ద్వారా నీరు తోడుతున్న దృశ్యం

అగ్నిప్రమాదంలో మామిడి, చీనీ చెట్లు దగ్ధం



కాలిపోయిన చెట్లను చూపి ఆవేదన చెందుతున్న రైతు లక్ష్మీదేవి

పోరుమామిళ్ల, మార్చి 11: మండలంలోని పుల్లీడు గ్రామంలో జరిగిన అగ్నిప్రమాదంలో మామిడి, చీనీ చెట్లు దగ్ధం అయ్యాయి. పుల్లీడు గ్రామానికి చెందిన అవటాల లక్ష్మీదేవి, ప్రశాంతి అనే రైతులు గ్రామ సమీపంలో నాలుగు సంవత్సరాల క్రితం మూడున్నర ఎకరాల్లో నిమ్మ, మామిడి, టెంకాయ మొక్కలు సాగు చేశారు. సోమవారం జరిగిన ప్రమాదంలో చెట్లతో పాటు లిఫ్ట్ ఇరిగేషన్ పైపులు పూర్తిగా కాలి బూడిదయ్యాయి. ఈ సంఘటనలో దాదాపు లక్ష రూపాయలు నష్టం వాటిల్లిందని ఆ మహిళా రైతులు వాపోయారు. విషయాన్ని హార్టికల్చర్ అధికారుల దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. కాగా, సోమవారం సీఎం సమావేశం ఉండడంతో అగ్నిమాపక కేంద్రం అధికారులు కూడా అందుబాటులో లేనట్లు తెలిసింది.

విషద్రావణం తాగి వ్యక్తి ఆత్మహత్య



ప్రసన్న బాలాజీ మృతదేహం

ముద్దనూరు మార్చి11: స్థానిక రైల్వేస్టేషన్‌లో సోమవారం ప్రసన్న బాలాజీ (37) అనే వ్యక్తి విషద్రావణం తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎర్రగుంట్ల రైల్వే హెడ్‌కానిస్టేబుల్ రాజారాం రెడ్డి తెలిపారు. మచిలీపట్నంకు చెందిన ప్రసన్న బాలాజీ ముద్దనూరులోని పాత వీధిలో నివాసం ఉంటున్నారు. అతని భార్య స్థానిక ఆసుపత్రిలో నర్సుగా పనిచేస్తోంది. బాలాజీ ఇక్కడే ఉంటూ ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కుటుంబంలో మనస్పర్థల కారణంగా విషద్రావణం తాగి రైల్వేస్టేషన్‌లో మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో రాజాశరత్ మృతి



రాజాశరత్ (ఫైల్)

రాజంపేట టౌన్, మార్చి 11: రాజంపేట వాసవీ సహృదయ సేవా సమితి అధ్యక్షుడు రాజాశరత్(41) ఆదివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డుప్రమాదంలో అక్కడికక్కడే మృతి చెందాడు. వివరాల్లోకెళితే.. రాజాశరత్ చాలా సంవత్సరాలుగా పేదలకు, అనాథలకు ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్నాడు. అందులో భాగంగా ఓ బీసీ విద్యార్థినిని హాస్టల్‌లో చేర్చేందుకు పుల్లంపేట నుంచి రాజంపేటకు ద్విచక్ర వాహనంలో బయలుదేరారు. భువనగిరిపల్లె ఆర్చి సమీపంలోకి రాగానే ఎదురుగా వస్తున్న లారీ లైటింగ్‌కు పక్కన ఆగడంతో వెనుకవైపు వస్తున్న కారు ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. దీంతో ద్విచక్ర వాహనంలోని ఇరువురు కింద పడగా రాజాశరత్‌కు తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. విద్యార్థినీ గాయపడటంతో కడప రిమ్స్‌కు తరలించారు. రాజాశరత్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రాజాశరత్ మృతి విషయం తెలుసుకున్న సేవా సంఘాలు, రాజకీయ నాయకులు, ఆర్యవైశ్య సంఘ నాయకులు పెద్దఎత్తున తరలి వచ్చి ఆయన మృతికి నివాళులర్పించారు. రాజాశరత్‌కి భార్య, నాలుగు నెలల కుమారుడు ఉన్నారు.

రాజంపేట పట్టణంలో చోరీ

- రూ. 1.7 లక్షల నగదు, 10 గ్రాముల బంగారు అపహరణ

రాజంపేట టౌన్, మార్చి 11 : రాజంపేట పట్టణంలోని ఎర్రబల్లి ప్రాంతం రామచంద్రపురం సమీపంలోని ఓ ఇంటిలో చోరీ జరిగినట్లు రాజంపేట రూరల్ పోలీసులు తెలిపారు. వివరాల్లోకెళితే...
రామచంద్రాపురం సమీపం లో నివాసం ఉంటున్న సయ్యద్ ఫాతిమా ఆదివారం రాత్రి కుటుంబ సభ్యు లతో కలసి బంధువుల ఇంటికి వెళ్లారు. తిరిగి సోమవారం ఉదయం ఇంటికి వచ్చి చూడగా... దొంగలు ఇంటికి చుట్టూ ఉన్న గ్రిల్స్‌ను వంచి ప్రధాన ద్వారా న్ని తొలిచి ఉంచారు. ఇంటిలోకి వెళ్లి చూడగా బీరువాలో ఉన్న రూ.1,70,000ల నగదు, వంద గ్రాముల బంగారు చోరీ చేసినట్లు గుర్తించా రు. ఈమేరకు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. రాజంపేట రూరల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని క్లూస్‌టీమ్ ద్వారా పలు ఆధారాలను సేకరించారు. కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పెద్దచెప్పలి ఘటనలో ఇరువర్గాలపై కేసు నమోదు

కమలాపురం రూరల్, మార్చి 11: పెద్దచెప్పలి ప్రాంతంలో జరిగిన ఘర్షణలో ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రిషికేశవరెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఆదివా రం పెద్దచెప్పలి ప్రాంతంలో టీడీపీలో ఇరువర్గాలు ఒకరిపై ఒకరు దాడి చేసుకున్న ఘటనలో 40 మందిపై కేసు నమోదు చేశామని ఆయన తెలిపారు. ఇందులో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డితో పాటు ఆయన వర్గంలోని 20 మందిపై, టీడీపీ మాజీ కార్యదర్శి కాశీభట్ల సత్యసాయినాథశర్మతో పాటు ఆయన వర్గంలో 20మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పూలంగిసేవలో పులకించిన వీరభద్రుడు





పూలంగిసేవ కార్యక్రమానికి హాజరైన భక్తజనం, పూలంగిసేవలో పులకిస్తున్న భద్రకాళీ సమేత వీరభద్రుడు

రాయచోటిటౌన్, మార్చి11: దక్షిణకాశీగా పేరుగాంచిన రాయచోటి పట్టణంలోని భద్రకాళీ సమేత వీరభద్రాలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం 7వ రోజు ఉదయం ప్రమథగణ హోమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్‌పర్సన్ పోలంరెడ్డి విజయమ్మ, మున్సిపల్ వైస్ చైర్మెన్ దశరథరామిరెడ్డి, ఆలయ ఈవో డీవీ రమణాలరెడ్డిల ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు శంకరయ్య, కృష్ణయ్య స్వాముల వేద మంత్రోచ్చారణల మధ్య భద్రకాళీ సమేత వీరభద్రుడి ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనంతరం వీరభద్రుడు, భద్రకాళీ అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలు, వివిధ రకాల పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి సూర్యప్రభ వాహనంపై పట్టణ పుర వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా టీటీడీ ధర్మ ప్రచార పరిషత్ వారిచే నిర్వహించిన చెక్కభజన భక్తులను అలరించింది.
అలాగే భద్రకాళీ సమేత వీరభద్రుడు పూలంగిసేవలో పులకించాడు. అలాగే నైనానందకరంగా నందివాహనంపై భద్ర కాళీ సమేత వీరభద్రుడు పట్టణ పురవీదుల్లో ఊరేగి భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా వీరభద్రస్వామి భజన మండలి తుమ్మల హరినాధ ఆధ్వర్యంలో నిర్వహించిన కోలాటం భక్తులను ఆకట్టుకుంది. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

దుంగలు స్వాధీనం.. స్మగ్లర్ అరెస్టు



స్వాధీనం చేసుకున్న దుంగలు, స్మగ్లర్‌ను చూపుతున్న అటవీశాఖాధికారులు

రైల్వేకోడూరు, మార్చి 11: రైల్వేకోడూరు రేంజి పరిధిలో గాదెల అటవీ ప్రాంతంలో సోమవారం ఆరు ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకుని, ఒక స్మగ్లర్‌ను అరెస్టు చేసినట్లు రైల్వేకోడూరు రేంజి ఇన్‌చార్జ్ రేంజర్ వై.రఘునాథరెడ్డి తెలిపారు. అందిన సమాచారం మేరకు గాదెల బీటు శేషాచల అడవిలో బోనిశిల ప్రాంతంలో ఎర్రచందనం దుంగలను అక్రమంగా తరలిస్తుండగా దాడులు చేసి తిరుణ్ణామలై జిల్లాకు చెందిన ఆర్.వెంకటేశం అనే తమిళ స్మగ్లర్‌ను అరెస్టు చేశామన్నారు. అతని వద్ద నుంచి 6 దుంగలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఘనంగా గంగమ్మ జాతర ప్రారంభం



పూజలు అందుకుంటున్న గంగమ్మ తల్లి

సీకేదిన్నె, మార్చి 11: చింతకొమ్మదిన్నె గంగమ్మ జాతర సోమవారం ఘనంగా ప్రారంభమైంది. అమ్మవారిని ప్రత్యేక అలంకరణలో ఏర్పాటు చేసి భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయంలో అన్ని వసతులతో పాటు భద్రతా ఏర్పాట్లు కూడా కట్టుదిట్టం చేశారు. జాతర సందర్భంగా భక్తులకు భారీగా అన్నదానం నిర్వహించారు. వృషభరాజములకు బండలాగుడు పోటీలు నిర్వహించి గెలుపొందిన ఎద్దుల యజమానులకు బహుమతులు అందజేశారు. కోలాటం కనువిందు చేసిం ది. సాంస్కృతిక కార్యక్రమాలు, రాత్రికి కల్యాణం, గ్రామోత్స వం నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఈఓ, చైర్మన్లు తెలిపారు. మంగళవారం రెండో రోజు తిరుణాల జరుగుతుందన్నారు. భక్తులకు దాతలు మజ్జిగ, మంచినీరు, పానకం అందించారు.

ప్రజా సమస్యలపరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు : జేసీ

రాయచోటి(కలెక్టరేట్), మార్చి 11: జగనన్నకు చెబుదాం-స్పందన కార్యక్రమంలో అందిన ప్రజా సమస్యల పరిష్కా రంలో నిర్లక్ష్యం చూపకుండా అర్జీదారులకు నాణ్యమైన పరిష్కారం అందించాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని స్పందన హాలులో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో జేసీతో పాటు డీఆర్వో సత్యనారాయణ ప్రజల నుంచి ఫిర్యా దులను స్వీకరించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేయాలన్నారు.
నిర్దీత గడువులోపు అర్జీదారుడు సంతృప్తి చెందేలా అర్జీలను నాణ్యతగా పరిష్కరించాలని ఆదేశించారు. పెండింగ్ దరఖాస్తులు, బియాండ్ ఎస్ఎల్ఏ, రీఓపెనింగ్ లేకుండా సంతృప్తిస్థాయి పెరిగేలా అర్జీలను పరిష్కరించాలన్నారు. అనంతరం అర్జీదారుల నుంచి వారు అర్జీలను స్వీకరించారు.

సీఎం రాకతో.. ఎన్ని కష్టాలో..!

- కొత్త ఆసుపత్రి ప్రారంభోత్సవానికి వెళ్లిన డాక్టర్లు
- వైద్యులు లేక రోగుల విలవిల



పులివెందుల ఏరియా ఆసుపత్రిలో మూతపడ్డ డాక్టర్ల గదులు

పులివెందుల రూరల్, మార్చి 11: పులివెందుల ఏరియా ఆసుపత్రిలో సోమవారం డాక్టర్లు లేక రోగులు విలవిల్లాడారు. వచ్చిన రోగులు కనీసం మాత్రలు, ఇంజక్షన్లు, బీపీ చెకప్‌కు కూడా నోచుకోలేదు. పులివెందులలో నూతనంగా నిర్మించిన మెడికల్ కళాశాల, వైఎస్సార్ గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్‌ను సోమవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ పారంభోత్సవానికి ఆసుపత్రిలోని డాక్టర్లు అందరూ వెళ్లిపోయారు. దీంతో డాక్టర్ల గదులు మూతపడ్డాయి. ఒకరిద్దరు నర్సులు మాత్రమే ఉండగా వారు కూడా ఖాళీగా కూర్చొని వచ్చిన రోగులకు తాపీగా సమాధానం చెప్పి పంపారు. అక్కడున్న నర్సులను కనీసం బీపీ అయినా చెకప్ చేయమ్మా అని ఓ వృద్ధురాలు అడగ్గా డాక్టర్లు రాస్తేనే చేస్తామంటూ నిర్లక్ష్యపు సమాధానం ఇచ్చింది. దీంతో చేసేది లేక ఆ వృద్ధురాలు వెనుదిరిగిపోయింది. ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లి వైద్యం చేయించుకునే స్థోమత లేక ప్రభుత్వ ఆసుపత్రికి వస్తే ఒక్క డాక్టర్ కూడా లేకపోవడం ఏమిటని అసహనం వ్యక్తం చేశారు. గర్భవతులు, పిల్లలు, యువకులు, వృద్ధులు వ్యయప్రయాసాలకు ఓర్చి ఆసుపత్రికి రాగా అక్కడ డాక్టర్లు లేక వెనుదిరిగిపోయారు. వంద పడకల ఆసుపత్రిలో ఒక్క డాక్టర్‌ను అయినా ఉంచి రోగులను చూడాలన్న కనీస ఆలోచన కూడా ఉన్నతాధికారులు చేయకపోవడం పేద ప్రజలపై ఎంతటి నిర్లక్ష్యం చూపుతున్నారో అర్థమవుతోంది.



డాక్టర్లు లేకపోవడంతో ఆసుపత్రి నుంచి వెనుదిరుగుతున్న రోగులు

కేజీబీవీ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కడప (ఎడ్యుకేషన్), మార్చి 11 : కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సమగ్రశిక్ష జిల్లా పథక అధికారి అంబవరం ప్రభాకర్ రెడ్డి తెలిపారు. ఈ నెల 12వ తేదీ నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తామని.. ఏప్రిల్ 11 వరకు గడువు ఉంటుందన్నారు. 36 మండలాల పరిధిలో 17 కేజీబీవీల్లో 1360 సీట్లు భర్తీ చేయనున్నట్లు తెలిపారు. జిల్లాలో 17 కేజీబీవీల్లో 2024-25 విద్యాసంవత్సరానికి 6వతరగతి, ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం నూతన ప్రవేశాలతో పాటు 7, 8, 9 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసిందన్నారు. జిల్లా పునర్విభజన అనంతరం 36 మండలాల్లో ఉన్న 17 కేజీబీవీల్లో 6వ తరగతిలో 680, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 680, 7వ తరగతిలో 19, 8లో 15, 9లో 24 సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. బడి బయట పిల్లలు, బడి మానేసిన పిల్లలు, అనాథలు, దివ్యాంగులు, ఎస్సీ ఎస్టీ, ఓబీసీ మైనార్టీ నిరుపేదల కుటుంబాలకు చెందిన విద్యార్థులు అర్హులని తెలిపారు. విద్యార్థిని, తల్లి, తండ్రి ఆధార్‌కార్డు, తల్లిదండ్రులు లేని యెడల సంరక్షకుల ఆధార్‌కార్డు, విద్యార్థికి సంబంధించిన మూడు పాస్‌పోర్టు సైజు ఫొటోలు, రేషన్‌కార్డు, ఆదాయ ధ్రువీకరణ పత్రం, స్టడీ సర్టిఫికెట్, మొబైల్ నెంబరు ఉండాలని తెలిపారు. కేజీబీవీల్లో బైపీసీకి సంబంధించి బి.కోడూరు, బి.మఠం, చక్రాయపేట, ఖాజీపేట, మైదుకూరు, పెండ్లిమర్రి, వల్లూరు, వేముల కేజీబీవీల్లో ఉన్నట్లు తెలిపారు. అలాగే ఎంపీసీ గ్రూపులకు సంబంధించి అట్లూరు, దువ్వూరు, చాపాడు, పోరుమామిళ్ల, పెద్దముడియం, కాశినాయన, సింహాద్రిపురంలో ఉన్నాయని హెచ్ఈసీ గ్రూపు కలసపాడు, ఎంపీహెచ్‌డబ్ల్యు జమ్మలమడుగులో ఉన్నట్లు తెలిపారు. విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

లాసెమిస్టరు పరీక్షలు ప్రారంభం




పరీక్షలను పర్యవేక్షిస్తున్న వైస్‌చాన్సలర్

కడప (ఎర్రముక్కపల్లె), మార్చి 11: వైవీయూ అనుబంధ న్యాయ కళాశాల విద్యార్థుల సెమిస్టరు పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యా యి. మూడేళ్ల లా కోర్సు ఐదో సెమిస్టరు పరీక్షలకు 242 మంది హాజ రు కాగా 23 మంది గైర్హాజరయ్యారు. ఐదేళ్ల లా 9వ సెమిస్టరు పరీక్షలకు 209 మంది హాజరు కాగా 17 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన ఐదేళ్ల ఐదో సెమిస్టరు పరీక్షకు 99 మంది హాజరు కాగా 17 మంది పరీక్షకు గైర్హాజరయ్యారన్నారు. పరీక్షల సూపరింటెండెంట్ ప్రొఫెసరు షావల్లిఖాన్ పర్యవేక్షణలో జరుగుతున్న ఈ పరీక్షలను వైస్‌చాన్సలర్ ప్రొఫెసరు చింతా సుధాకర్ ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థుల హాల్‌టికెట్లను పరిశీలించారు. పరీక్షల తనిఖీలో వైస్‌చాన్సలర్‌తో పాటు రిజిస్ట్రార్ ప్రొఫెసరు వైపీ వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపల్ రఘునాదరెడ్డి, కంట్రలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసరు ఎస్.ఈశ్వర్‌రెడ్డి ఉన్నారు.

స్పందన అర్జీలపై దృష్టి పెట్టండి

రాయచోటిటౌన్, మార్చి11: స్పందన కార్యక్రమం ద్వారా వచ్చే ఫిర్యాదులపై సత్వరం స్పందించి బాధితులకు చట్ట పరిధిలో న్యాయం చేయాలని అన్నమయ్య జిల్లా అదనపు ఎస్పీ డాక్టర్ వీబీ రాజ్ కమల్ అన్నారు. సోమవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో స్పందన (గ్రీవెన్స్‌డే) కార్యక్రమం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన 29 మంది ఫిర్యాదుదారులతో ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకుని రాతపూర్వకంగా ఫిర్యాదులు స్వీకరించారు.



అవకాశం ఇవ్వండి.. అభివృద్ధి చేసి చూపిస్తా..!

● టీడీపీ అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటిటౌన్, మార్చి11: ఒక్క అవకాశం ఇవ్వండి రాయచోటి రూపు రేఖలు మార్చి చూపిస్తానని రాయచోటి నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి కోరారు. సోమవారం రాయచోటి మున్సిపాలిటీ పరిధిలోని 28, 29, 30 వార్డుల్లో ప్రచారం సందర్భంగా దర్గాలో ప్రార్థనలు చేశారు. అనంతరం సూపర్ సిక్స్ పథకాలను వివరిస్తూ ఇంటింటా ప్రచారం నిర్వహించారు. మహిళల కోసం రాయచోటి మున్సిపాలిటీ పరిధిలోని కొత్తపల్లిలో ఏసీతో కూడిన మెటర్నిటీ హాస్పిటల్ నిర్మిస్తానని హామీ ఇచ్చారు. రాయచోటి పేరుకు మాత్రమే గ్రేడ్ వన్ మున్సిపాలిటీ అని, ఇక్కడ ఎలాంటి మౌలిక వసతులు కూడా లేవన్నారు. సైకిల్ గుర్తుకు ఓటు వేసి గెలిపిస్తే రాబోయే రెండు నెలల్లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తుందని, సమస్యలు పరిష్కారమవుతాయని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్‌బాషా, మాజీ మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు సలావుద్దీన్, మైనార్టీ నేతలు ఖాదర్ హుస్సేన్, జాఫర్‌అలీ, అబ్దుల్‌రహీం, ఎజాస్, సయ్యద్ ఆబిద్ హుస్సేన్, ఇర్షాద్, జిలాన్, మహమ్మద్‌అలీ, జావీద్‌హుస్సేన్, జాకీర్‌హుస్సేన్, పటాన్ ముజీబ్‌ఖాన్, మైనుద్దీన్, అతావుల్లా, షంషీర్ తదితరులు పాల్గొన్నారు.



29వ వార్డులో ప్రచారం చేస్తున్న మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

ఎన్నికల బాండ్ల వివరాలు ప్రకటించాలి

●సీపీఎం నేత అబ్బవరం రామాంజులు

రాయచోటిటౌన్, మార్చి11: ఎన్నికల బాండ్లపై సుప్రీం ఆదేశాలను ఎన్నికలకు ముందే అమలు చేయాలని, బీజేపీ ఒత్తిడితో కుంటిసాకులు చెప్పడం మానుకోవాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు అబ్బవరం రామాంజులు డిమాండ్ చేశారు. సోమవారం రాయచోటి పట్టణంలోని ఎస్ఎన్‌కాలనీలోని ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల బాండ్ల లావాదేవీలపై ఈ నెల 13వ సుప్రీంకోర్టుకు వివరాలు తెలియజేయాలని, ఎన్నికల బాండ్ల చట్టం పౌరుల ప్రాథమిక హక్కులను హరించే విధంగా ఉందంటూ ఇచ్చిన తీర్పు అమలు చేయాలన్నారు. ఎన్ని కల బాండ్ల వివరాలు, లావాదేవీలు, ఇచ్చిన వారు, పుచ్చుకున్న వారి వివరాలు 2024 మార్చి 13వ తేదీ లోపు తెలియజేయాలని సుప్రీంకోర్టు ఆదేశించినా బీజేపీ ఒత్తిడితో ఎస్‌బీఐ 116 రోజులు గడువు కావాలని సుప్రీంకోర్టులో అఫిడవిట్ వేసిందన్నారు. దీన్ని బట్టి 2024 ఏప్రిల్ ఎన్నికలకు ముందటి వివరాలు ఇవ్వడానికి సిద్ధంగా లేనట్లుతేటతెల్లమవుతోందని ఆరోపించారు. నాలుగు నెలల కిందట ఎప్పుడు ఎన్నికల విరాళాలు ఇవ్వని 23 కార్పొరేట్ సంస్థలు 9.05 కోట్లు విరాళాలు ఇచ్చాయని చెప్పారని, వారిపేర్లు వెల్లడించడానికి సమయం కోరడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఎలక్ట్రోరల్ బాండ్ల వివరాలు తెలపాలని బ్యాంకు మేనేజర్‌కి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం సభ్యులు వెంకటయ్య, మాధవయ్య, విశ్వనాథరెడ్డి, మురళి, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.



స్టేట్ బ్యాంక్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నేతలు

రాజంపేట : ఎన్నికల బాండ్ల అవినీతిని చట్టబద్ధం చేయడమేనని సీపీఎం నాయకులు ఎస్‌బీఐ కార్యాలయం ఎదుట ం నిరసన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు సీహెచ్ చంద్రశేఖర్, రవికుమార్, మణి, సీపీఐ నాయకులు సి.హరిప్రసాద్, షేక్ బూరాన్ పాల్గొన్నారు.

వంద రోజులు పని కల్పించండి



పెమ్మాడపల్లెలో ఉపాధి పనులను తనిఖీ చేస్తున్న డ్వామా పీడీ మద్దిలేటి

రాయచోటిటౌన్, మార్చి11: ప్రతి ఉపాధి కూలీ కుటుంబానికి తప్పని సరిగా వందరోజుల పని కల్పించాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ మద్దిలేటి ఆదేశించారు. రాయచోటి మండల పరిధిలోని పెమ్మాడపల్లి, దిగువ అబ్బవరం గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కరువు పరిస్థితుల్లో ప్రతి కుటుంబానికి 100 రోజులు పని కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఉపాధి సిబ్బందికి సూచించారు. పనుల విషయంలో ఎక్కడా అవినీతికి తావు లేకుండా పనిచేసిన కూలి ఖాతాకే కూలి జమ చేస్తామని తెలియజేశారు. ఈ కార్య క్రమంలో అబ్బవరం, పెమ్మాడపల్లె క్షేత్ర సహాయకులు, సాంకేతిక సహాయకులు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

టీడీపీ అధిష్టానం చరిత్రాత్మక నిర్ణయం

● రైల్వేకోడూరు టీడీపీ ఇన్‌చార్జి నియామకంపై పంతగాని

ఓబులవారిపల్లె, మార్చి 11 : నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జిగా ముక్కా రూపా నందరెడ్డిని నియమించి తెలుగుదేశం పార్టీ అధిష్టానం చారిత్రాత్మక నిర్ణయం తీసుకుందని రాష్ట్ర టీడీపీ సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు పంతగాని నరసింహ ప్రసాద్ తెలిపారు. సోమవారం తెలుగుదేశం పార్టీ నాయకులు, అభిమానులతో కలసి ఆయనకు పూలబొకే అందజేసి శాలువా కప్పి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డి మాట్లాడుతూ రాబోయే ఎన్నికలలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని గద్దె దింపి సహకరించాలన్నారు. రైల్వేకోడూరు నియోజకవర్గం అభ్యర్థిని గెలిపించి అధినేత చంద్రబాబుకు కానుకగా ఇద్దామని నాయకులకు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సీనియర్ నాయకుడు కాకర్ల సుబ్బరాయుడు (లారీ), రామాంజనేయులు నాయుడు, కేశినేని నారాయణ, దేవరకొండ, చంద్రబాబునాయుడు , కట్ట గుండయ్య నాయుడు, టీడీపీ బీసీ సెల్ కార్యదర్శి అమర్‌నాథ్, టీడీపీ ఎన్ఆర్ఐ సెల్ నాయ కులు మల్లెం హేమంత్, రాష్ట్ర ముస్లిం మైనారిటీ నాయకులు మస్తాన్, జుబేర్, షేక్ మస్తాన్, బాబా సాహెబ్, బొక్కసం చలపతి, పున్నటి వాసుదేవరెడ్డి, ఓబిలి ఈశ్వర్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, కడియాలపల్లె శ్రీనివాస్‌నాయుడు, రామచంద్రనాయుడు, పోలిన శివయ్యనాయుడు, వైకోట ఎంపీటీసీ సుబ్రమణ్యం, ఉమ్మలరాజు సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.



ముక్కా రూపానందరెడ్డిని అభినందిస్తున్న పంతగాని నరసింహ ప్రసాద్,

బలిజల సంక్షేమానికి కృషి

సుండుపల్లె, మార్చి11: బలిజసేన రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా సుండుపల్లె మండలానికి చెందిన నంద్యాల రెడ్డిరాణిని నియమిస్తూ బలిజసేన రాష్ట్ర వ్యవస్థాపకుడు కృష్ణప్రసాద్ ఉత్తర్వులు జారీ చేసినట్లు బలిజ సేన నాయకులు సోమవారం తెలిపారు. బలిజ, కాపు, ఒంటరి కులాల ఐకమత్యం, అభివృద్ధి, రాజ్యాధికారం కోసం బలిజసేన నిరంతరం పనిచేస్తుందని నంద్యాల రెడ్డిరాణి తెలిపారు. ఐదేళ్లుగా వైసీపీ బలిజలకు తీరని ద్రోహం చేసిందని ఆమె తెలియజేశారు. రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం, జన సేన కూటమిని గెలిపించుకోవాలని ఆమె తెలియజేశారు. రాష్ట్రం అన్ని రంగాల్లో అభి వృద్ధి సాధించాలంటే జగన్‌మోహన్‌రెడ్డిని గద్దె దింపాలన్నారు. రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా నియమించినందుకు రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.



నంద్యాల రెడ్డిరాణి

చిత్రలేఖనంలో గురుకుల విద్యార్థుల ప్రతిభ

రామాపురం, మార్చి11: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులు విజయవాడలో జరిగిన జాతీయ స్థా యి చిత్రలేఖనం పోటీల్లో పది మంది విద్యార్థులు గోల్డ్ మెడ ల్స్ సాధించినట్లు ఆర్ట్ మాస్టర్ ఆనంద్‌బాబు, ప్రిన్సిపాల్ వర ప్రసాద్ తెలిపారు. ఈ నెల 10 న విజయవాడలో డ్రీమ్స్ చిల్ర ్రన్స్ ఆర్ట్స్ అకాడమీ, అనంత డైమండ్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన నేషనల్ లెవెల్ కాంపి టీషన్‌ను విజయవాడ ఎయిర్‌పోర్టు డైరెక్టర్ లక్ష్మీకాంత్‌రెడ్డి ప్రారంభించారు. 2 వేల మంది విద్యార్థులు పాల్గొన్న ఈ పోటీలో రామాపురం గురుకుల పాఠశాల నుంచి 20 మంది విద్యార్థులు హాజరుకాగా పది మంది గోల్డ్‌మెడల్స్ సాధించారని తెలిపారు. జాతీయ స్థాయిలో తమ స్థానిక గురుకుల పాఠశాలలో సోమవారం విద్యార్థులు గోల్డ్ మెడల్స్ సాధించడంపై పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది ఆర్ట్ మాస్టర్ ఆనందరాజు ను అభినందించి విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.

ప్రజాధనంతోనే సిద్ధం సభల నిర్వహణ

●టీడీపీ పార్లమెంటు అధ్యక్షుడు చమర్తి

రాజంపేట టౌన్, మార్చి11 : వైసీపీ ప్రభుత్వం రాష్ట్ర ఖజానాను సిద్ధం సభలకు ఖర్చు చేస్తూ ప్రజల సొమ్మును వృథా చేస్తోందని టీడీపీ పార్లమెంటు అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు మండిపడ్డారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ సభలకు భారీ ఎత్తున తరలివస్తున్నట్లు చూపించేందుకు ఐదు జిల్లాలకు ఒక సభను ఏర్పాటు చేయడంతోపాటు, జనాలను తరలించేందుకు ప్రజారవాణాను వాడుకుంటూ అధికార దుర్వినియోగం చేస్తూ గొప్పలు చెప్పుకుంటున్నారే తప్ప ప్రజలు స్వచ్ఛందంగా ఎవరూ సభలకు హాజరు కావడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సంపూర్ణ మద్యపాన నిషేధం హామీ నెరవేరకపోగా కల్తీ మద్యంతో రాష్ట్రంలో 30వేల మంది మరణించారని నాసిరకం మద్యంతో ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. అధికారంలోకి వస్తే 3లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు హామీ నిలబెట్టుకోలేదన్నారు. ఉచితంగా ఇసుకను ఇస్తానని వేల కోట్లకు కుంభకోణానికి తెరలేపారన్నారు. దీంతో 40 లక్షల మంది భవన కార్మికులు రోడ్డుపాలయ్యారన్నారు. ఇచ్చిన హామీలు నెరవేర్చలేని ఇలాంటి ముఖ్యమంత్రిని ప్రజలు ఏ విధంగా మళ్లీ నమ్ముతారని ఆయన విమర్శించారు. ఇప్పటికైనా రాష్ట్ర అభివృద్ధికి బాటలు వేసిన చంద్రబాబునాయుడును గెలుపించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

సూపర్‌సిక్స్ పథకాలపై ప్రచారం

రాజంపేట టౌన్, మార్చి11 : మండల పరిధిలోని రోళ్లమడుగులో బాబు ష్యూరిటీ, భవిష్యత్తుకు గ్యారెంటీ తో పాటు, సూపర్ సిక్స్ పథకాలపై రాజంపేట రూరల్ అధ్యక్షుడు గన్నె సుబ్బనరసయ్య నాయుడు ప్రచారం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రోళ్లమడుగు, ఎగువపల్లె, నడింపల్లె, పెద్దూరు, అరుంధతివాడలో ప్రతిఇంటికి వెళ్లి సూపర్‌సిక్స్ క్యాలెండర్ ఇచ్చి టీడీపీ ప్రభుత్వంలో అమలు చేయబోయే సంక్షేమ పథకాలనుతెలియజేశారు. వైసీపీ పాలనలో రాష్ట్రం ఏం కోల్పోయిందో ప్రజలకు వివరించారు. శంఖారావంకు సంబంధించిన క్యాలెండర్లు, ఇతర సామాగ్రిలను ఇంటింటికి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బూత్‌కన్వీనర్ ముప్పవరం శ్రీకాంత్, తల్లపనేని బాలాజీ, కాలనీ వాసులు పాల్గొన్నారు.

టీడీపీ అభ్యర్థి విజయానికి కృషి చేయండి

గాలివీడు, మార్చి11: రా యచోటి నియోజకవర్గ టీ డీపీ అభ్యర్థిమండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి విజయానికి కలిసికట్టుగా కృషి చేద్దామని ఆయన తమ్ముడు లక్ష్మీ ప్రసాద్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. సోమవారం మండల కేంద్రంలో ఆయన తెలుగుదేశం పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అమలు చేయనున్న ఆరు గ్యారెంటీలను ప్రజల్లోకి విస్తృ తంగా తీసుకువెళ్లాల్సిన బాధ్యత కార్యకర్తలదే నని తెలిపారు. ప్రస్తుత వైసీపీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. కార్యకర్తలందరూ సమన్వయంగా వ్యవహరించి రాంప్రసాద్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించడానికి కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాలకు చెందిన పలువురు వైసీపీ నాయకులు టీడీపీలో చేరారు.



పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న టీడీపీ నాయకులు

ఎన్నికల్లో గొడవలు చేస్తే తాటతీస్తాం

రైల్వేకోడూరు, మార్చి 11: ఎన్నికల్లో గొడవలు చేస్తే తాటతీస్తామని రైల్వేకోడూరు సీఐ టీ. బాబు హెచ్చరించారు. సోమవారం రైల్వేకోడూరు మండలం లోని లక్ష్మీగారిపల్లెలో కేంద్రబలగాలతో కవాతు నిర్వహించారు. పలు ప్రాంతాల్లో తనిఖీలు చేశారు. అనంతరం ప్రజలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించు కోవాలని, ఎలాంటి గొడవలు ఉండరాదని తెలిపారు. మారణాయుధాలు కలిగి ఉంటే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఉద్రిక్తతలు తలెత్తకుండా చూస్తామన్నారు. రోడ్డు ప్రమాదాలు, ఆస్తి నేరాలు, మహిళలపై నేరాలు, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు.

నందలూరు: స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికల నిర్వహణే ధ్యేయంగా నిర్ణయించుకున్నామని రాజంపేట రూరల్ సీఐ మంజునాథరెడ్డి అన్నారు. మండలంలోని పాటూరు పంచాయతీలో ఎస్ఎస్‌బీ డీఎస్పీ రామ్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీసులతో సోమవారం కవాతు నిర్వహించారు.

చిట్వేలి: రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రశాంత వాతావరణంలో ఓటుహక్కు వినియోగించుకునేలా ప్రజలకు భరోసా కల్పించేందుకు చిట్వేలి మండల పరిసర ప్రాంతాలలో సోమవారం కేంద్ర పోలీసు బలగాలు చిట్వేలి బ్రిడ్జి నుంచి కె.ఎస్. అగ్ర హారం వరకు కవాతు నిర్వహించాయి.. ఏఎస్ఐ మురళి, సిబ్బంది, కేంద్ర బలగాలు పాల్గొన్నాయి.



చిట్వేలిలో కవాతు చేస్తున్న కేంద్ర బలగాలు

ఘనంగా ప్రపంచ గ్లకోమా వారోత్సవాలు

రాయచోటిటౌన్, మార్చి11: ప ట్టణంలోని ఏరియా ఆసుపత్రి లో జిల్లా కంటి వెలుగు ప్రో గ్రాం అధికారి డాక్టర్ రియాజ్ బేగ్ ఆధ్వర్యంలో సోమవారం ప్రపంచ గ్లకోమా వారోత్సవా లను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భం గా డాక్టర్ రి యాజ్ బేగ్ మాట్లాడుతూ గ్లకోమా అనేది కంటికి సంబం ధించిన వ్యాధి అని, కంటి లోపల పీడనం పెరిగి కంటి నరాలు సచ్చు పడిపోయే విధంగా చేసి ఫలితంగా రాను రాను కంటి చూపు తగ్గిపోతుందన్నారు. ఈ గ్లకోమ ప్రారంభ దశలో ఎటువంటి లక్షణాలు కనపడక పోవచ్చునని, ప్రాథమిక దశలో గ్లకోమా లక్షణాలు 40 ఏళ్లకు పైబడిన వ్యక్తులు తరచూ అద్దాలు మార్చాల్సి రావడం, వెలుతురు చుట్టూ రంగు వలయం ఏర్పడటం, తరచుగా తలనొప్పితో పాటు కంటి ఎరువు, వాంతులు, కనుగుడ్డు నొప్పి కలిగి ఉండటం వంటి లక్షణాలు ఉంటాయన్నారు. 35 నుంచి 40 సంవత్సరాల వయస్సు వారు ప్రతి ఒక్కరూ ఈ పరీక్ష చేయించుకో వాలన్నారు. ఇంతకు పూర్వం కనుగుడ్డుపై గాయం తగిలిన వారు, స్టెరాయిడ్ మందు లు అధికంగా వాడేవారు, షుగర్, బీపీ ఉన్న వారు, రక్త సంబంధీకుల్లో ఎవరికైనా గ్లకో మా వ్యాధితో బాధపడుతున్నట్లయితే, ఆ కుటుంబంలో ప్రతి ఒక్కరూ ఈ గ్లకోమ పరీక్ష అన్ని సామాజిక, ఏరియా వైద్యశాల ఆసుపత్రుల్లో అప్తల్మాలజిస్టల దగ్గర చేయించుకో వాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యశాల సీఎస్ఆర్ఎంవో డాక్టర్ కిరణ్‌కుమార్, ఆప్తాల్మిక్ అసిస్టెంట్ కల్పన, ప్రజలు పాల్గొన్నారు.

గంగమ్మ జాతరకు తరలిన చాందినీ బండ్లు

రామాపురం, మార్చి11: మండలంలోని పలు గ్రామాల నుంచి సోమవారం అనంతపురం గంగమ్మ తల్లి జాతరకు చాందినీ బండ్లు తరలివెళ్లాయి. ప్రతి ఏడాది తీరుగానే ఈ సారి కూడా చాందినీ బండ్లు కట్టి ప్రజలు వారి వారి మొక్కుబడులు తీర్చుకుంటున్నారు.

కేజీబీవీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

రామాపురం, మార్చి11: కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి 6, మొదటి సంవత్సరం ఇంటర్మీడియట్ ప్రవేశాలకు ఈ నెల 12 నుంచి ఏప్రిల్ 11వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపాల్ పుష్పలత తెలిపారు. వీటితో పాటు 7వ తరగతిలో 10, 8వ తరగతిలో 3 సీట్లు ఖాళీ ఉన్నాయని, ఈ సీట్లకు కూడా ఈ నెల పది నుంచి ఏప్రిల్ 10 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో సీఎస్సీ కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ కోర్సులు ఉంటాయన్నారు. అనాథలు, బడిబయటి చిన్నారులు, పేద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ దరిద్రరేఖకు దిగువ జీవిస్తున్న బాలికలు మాత్రమే ప్రవేశాలకు అర్హులన్నారు. దరఖాస్తు చేయు విద్యార్థులు కులం, ఆదాయం, గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.20 వేలు పట్టణ ప్రాంతాల్లో రూ.1.40 లక్షలు ఉండే విధంగా ధ్రువీకరణ పత్రాలను జతపర్చాలన్నారు. .



రాష్ట్ర ప్రయోజనాల కోసమే పొత్తు

రాయచోటిటౌన్, మార్చి11: రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు బీజేపీతో కలిశారని, రాబోయే ఎన్నికల్లో బీజేపీ, టీడీపీ, జనసేన కూటమిదే అధికారం అని రాజంపేట పార్లమెంట్ టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి కూనాసి సుబ్బరాజుయాదవ్ అన్నారు. సోమవారం ఆయన స్థానిక పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి రాష్ట్రంలో ఏ వర్గానికి న్యాయం జరగలేదన్నారు. ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతే టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిని గెలిపిస్తుందని ఉద్యోగులు, మేధావులు ఈ ప్రభుత్వాన్ని ఇంటికి నాగనంపడానికి సిద్ధంగా ఉన్నారని చెప్పారు.

బండలాగుడు పోటీలు

నందలూరు, మార్చి 11: శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా చింతకాయలపల్లె మాజీ సర్పంచ్ గంగినాయుడు ఆధ్వర్యంలో సోమవారం బండలాగుడు పోటీలు నిర్వహించారు. టంగుటూరు, నీలిపల్లె, చింతకాయలపల్లె ఎద్దులు తొలి మూడు స్థానాల్లో నిలిచి 20,15,10వేల రూపాయల నగదు బహుమతులను గెలుచుకున్నాయి. ఈ కార్యక్రమంలో కుందా నెల్లూరు వెంకటేశ్వరరెడ్డి, చింతకాయల ఎల్లయ్య, ట్రాక్టర్ సుబ్బన్న, మీసాల ఎల్లయ్య, రమణ స్థానిక నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

వీరబల్లి, మార్చి11: తిరుపతికి చెందిన అబి ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు మునిరెడ్డి వీరబల్లి జెడ్పీ పాఠశాలకు సోమవారం పరీక్ష సామగ్రిని అందజేశారు. ఇన్‌చార్జి హెచ్ఎం డీవీఎస్ కుమార్ వాటిని విద్యార్థులకు పంపిణీ చేశారు. వీరబల్లి టీడీపీ సీనియర్ నాయకులు శ్రీధర్‌రెడ్డి సలహా మేరకు సుమారు 70 మంది విద్యార్థులకు ప్యాడు, పెన్ను, హాల్‌టికెట్ కవర్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమన్వయంతోనే సుపోషిత భారతదేశం

చిట్వేలి, మార్చి11 : అన్ని శాఖల సమన్వయంతోనే సుపోషిత భారతదేశం సాధ్యమవుతుందని సీడీపీవో రాజేశ్వరి అన్నారు. పౌష్టికాహార పక్షోత్సవాల్లో భాగంగా స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఐసీడీఎస్ చిట్వేలి ప్రాజెక్టు ఆధ్వర్యంలో ప్రారంభ కార్యక్రమం, సదస్సు నిర్వహించారు.గ్రేడ్-1 సూపర్‌వైజర్ వసుంధరమ్మ, గ్రేడ్-2 సూపర్‌వైజర్ సురేఖారాణి, అంగన్‌వాడీ వర్కర్లు, సుజాత, సుధామణి, సుజన, మాధవిలత, శ్రీదేవి, శాంతమ్మ, శ్యామల, లక్ష్మీకుమారి, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సుండుపల్లె: గర్భిణులు బాలింతలు వచ్చి అంగన్వాడీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారి హసన్‌వలి కోరారు. సోమవారం మండల కేంద్రంలోని సాయన్నగారిపల్లె అంగన్వాడీ కేంద్రంలో పోషణ పఖ్వాడా నిర్వహించారు. సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి, మహిళా పోలీసు మమత, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏడో వారం అన్నదానం కొనసాగింపు

సుండుపల్లె, మార్చి11: బీజేపీ రాష్ట్ర కార్యదర్శి నాగోతు రమేశ్ నాయుడు ఆర్థిక సహకారంతో సుండుపల్లె మండల కేంద్రంలో వరుసగా ఏడవ వారం అన్నదానం చేసినట్లు బీజేపీ జిల్లా నాయకుడు వెంకటరామరాజు సోమవారం తెలిపారు. మండల కేంద్రంలో గత ఏడు వారాల నుంచి ప్రతి సోమవారం అన్నదానం చేసి పేదల ఆకలి తీరుస్తున్నారన్నారు. బీజేపీ మండల కిసాన్ మోర్చా అధ్యక్షుడు సుబ్బరామరాజు, సిద్దేశ్వర, రెడ్డెయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆసరా చెక్కుల పంపిణీ

పెనగలూరు, మార్చి11 : మండల పరిషత్ సభాభవనంలో సోమవారం సాయంత్రం ఏసీ, ఏపీఎం నిరంజన్ కుమార్ అధ్యక్షతన 1759 మంది డ్వాక్రా మహిళలకు ఆసరా చెక్కులు పంపిణీ చేశారు. త

జెడ్పీ హైస్కూల్ ప్రారంభోత్సవం

ఓబులవారిపల్లె, మార్చి11 : మండలంలోని తల్లెంవారిపల్లె గ్రామ పంచాయతీలో సోమవారం జిల్లా పరిషత్ హైస్కూల్‌ను మంత్రి పెద్దిరెడ్డి, ఎమ్మెల్యే, ఎంపీ, జడ్పీ చైర్‌పర్సన్, కలెక్టర్ అభిషిక్త్ కిషోర్, ఎస్పీ కృష్ణారావు, జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ఈ పాఠశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అమెరికాలో నవమి ఉత్సవాలకు ఒంటిమిట్ట పట్టు వస్త్రాలు

ఒంటిమిట్ట, మార్చి11 : చికాగోలోని లెమాంట్ బాబా మందిరంలో నిర్వహించనున్న శ్రీరామనవమి ఉత్సవాలకు ఒంటిమిట్ట కోదండరామ స్వామి ఆశీస్సులు పొందదిన పట్టువస్త్రాలను పంపించారు. ప్రవాసాంధ్రుల నిర్ణయం మేరకు సాలాబాదుకు చెందిన ఎన్ఆర్ఐ ముమ్మడిపాపిరెడ్డి గారి వెంకటసుబ్బారెడ్డి, భానుశ్రీ దంపతులు పట్టువస్త్రాలకు పూజలు చేయించారు. ఈ కార్యక్రమంలో ముమ్మడి పాపిరెడ్డి గారి మల్లారెడ్డి, లలితమ్మ, ఆయన స్నేహితులు ముమ్మడి వెంకట శేషారెడ్డి, వారి కుటుంబ సభ్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



ప్రశాంతంగా ఇంటర్మీడియట్ పరీక్షలు

రాయచోటిటౌన్, మార్చి11: జిల్లా వ్యాప్తంగా సోమవారం ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. జిల్లాలోని 54 పరీక్షా కేంద్రాల్లో 9,868 మంది పరీక్ష రాయాల్సి ఉండగా 549 మంది గైర్హాజరయ్యారు. రాయచోటిలోని పలు పరీక్షా కేంద్రాల వద్ద డీఐఈవో కృష్ణయ్య హాల్ టికెట్లను తనిఖీ చేశారు. పరీక్ష కేంద్రాల్లో సౌకర్యాలపై ఆరా తీశారు. పరీక్షా కేంద్రాల వద్ద బయట వ్యక్తులు ఎవరు కనిపించకూడదని, ఎలక్ట్రానిక్ వస్తువులను అనుమతించరాదని మాస్ కాపీయింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా అన్ని పరీక్షా కేంద్రాలను చీఫ్ సూపరిండెంట్ అధికారులు, డిపార్టుమెంట్ అధికారులతో పాటు రెండు ఫ్లైయింగ్ స్క్వాడ్స్, రెండు సిట్టింగ్ స్క్వాడ్స్ బృందాల అధికారులు ప్రశాంత వాతావరణంలో పబ్లిక్ పరీక్షలు జరిగేలా పర్యవేక్షించారు. పరీక్షలు సందర్భంగా పరీక్షా కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా అన్నమయ్య జిల్లా ఎస్పీ కృష్ణారావు ఆదేశాల మేరకు పోలీసు అధికారులు సిబ్బంది గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు.

వేదిక్ మ్యాథ్స్, అబాకస్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

నందలూరు, మార్చి11 : వేదిక మ్యాథ్స్ రాష్ట్ర స్థాయిపోటీలలో స్థానిక జ్ఞాన దీప్తి పాఠశాల విద్యార్థిని ఆకుల చరిత చాంపియన్‌గా నిలిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. పోసిన మాన్వి పద్మశాలి, గీతాశ్రీ, సాయిమాధవ్ రాష్ట్రస్థాయిలో తమ ప్రతి భను చాటారు. ఆయా విద్యార్థులకు పాఠశాల కరస్పాండెంటు ప్రిన్సిపాల్ అభినందించారు.

చిన్నమండెం: మండలంలోని టీ. చాకిబండ కస్పా గోల్డెన్ స్ప్రింగ్ స్కూల్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులకు రాష్ట్ర స్థాయిలో రెండు బహుమతులు వచ్చినట్లు స్కూల్ యాజమాన్యం ఒక ప్రకటనలో తెలిసింది. ఐదవ తరగతి విద్యార్థిని మరియంకు సీనియర్ లెవెల్‌లో రాష్ట్ర స్థాయిలో మూడవ బహుమతి, జూనియర్స్ లెవెల్‌లో షేక్. సారియాకు రాష్ట్ర స్థాయిలో మూడో బహుమతి లభించినట్లు తెలిపారు

టీడీపీ రాష్ట్ర కార్యదర్శి జన్మదిన వేడుకలు

చంద్రగిరి, మార్చి11: టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వీరపల్లి హేమాంబరధరరావు జన్మదిన వేడుకలు సోమవారం తిరుపతిలో ఘనంగా జరిగాయి. చిన్నారుల మధ్య జరిగిన ఈ వేడుకల్లో పలువురు టీడీపీ నాయకులు పాల్గొని హేమాంబరధరరావుకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం చిన్నారులతో కేక్ కట్ చేయించి అందరికీ పంచిపెట్టారు. చంద్రగిరి మండల టీడీపీ అధ్యక్షుడు సుబ్రమణ్యం నాయుడు, నాయకులు గౌస్‌బాషా, ముంద్లూరి బాలతకృష్ణమూర్తి, నగరం రమేష్ తదితరులు పాల్గొన్నారు.



హేమాంబరధరరావుకు శుభాకాంక్షలు తెలుపుతున్న చిన్నారులు

కళ్యాణం కమనీయం



పెండ్లిమండపం వద్ద వధూవరుల అలంకరణలో ఆది దంపతులు

- ఆది దంపతుల వివాహ వేడుకలతో శోభిల్లిన శ్రీకాళహస్తి
- అదే ముహూర్తాన ఒక్కటైన 30 జంటలు



అశేషభక్త జనం మధ్య కళ్యాణోత్సవ పూజలు



శ్రీకాళహస్తి, మార్చి 11: గజవాహనంపై వరుడిగా శివయ్య ... సింహవాహనంపై సిగ్గులొలుకుతూ పార్వతమ్మ కల్యాణోత్సవ వైభవంతో శ్రీకాళహస్తి క్షేత్రం పరవశించింది. మహాశివరాత్రి ఉత్సవాల్లో స్కంధరాత్రిని పురస్కరించుకుని ఉత్సవమూర్తులను మంగళవాయిద్యాలు... మేళ తాళాలు... కళాకారుల ఆటపాటల మధ్య ఆదివారం అర్ధరాత్రి వివాహ వేదిక వద్దకు కోలాహలంగా తీసుకువచ్చారు. చతుర్వేద పారాయణం పూర్తయ్యాక సప్తపది కార్యక్రమం ఆగమోక్తంగా ప్రారంభమైంది. ఆలయ అనువంశిక ప్రధాన దీక్షా గురుకుల్ స్వామినాథన్, వరద, నిరంజన్ గురుకుల్ సారధ్యంలో సప్తపది విశేషోత్సవాన్ని వేదోక్తంగా నిర్వహించారు. స్కందుడి జననం కోసం నిర్వహించిన కళ్యాణోత్సవ ఘట్టంలో చండికేశ్వర రాయబార పర్వం రక్తికట్టించింది. హిమవంతుడి కుమార్తె అయిన పార్వతీదేవికి, పరమేశ్వరుడికి పరిణయం నిశ్చయం చేసేందుకు బ్రహ్మ, విష్ణువులతో పాటు ఇంద్రాది సకల దేవతలు తరలివచ్చారు. జగద్రక్షకుడైన స్వామివారు చిటికెడు విభూది, ఒక్క బిల్వపత్రం కట్నంగా ఇచ్చేలా రాయబారం కొనసాగింది. ఉదయం 5 గంటల సమయంలో మాంగల్యధారణ కార్యక్రమం పూర్తి చేశారు. ఇదే ముహూర్తంలో 30 జంటలు పెండ్లి మండపం వద్ద వివాహంతో ఒక్కటయ్యాయి. అంతకు ముందు వధూవరులకు ముక్కంటి ఆలయం తరపున మంగళ సూత్రాలు,పసుపు, కుంకుమ, గాజులు, దుస్తులు అందజేశారు.శివపార్వతుల కళ్యాణ మహోత్సవం వీక్షించేందుకు వచ్చిన భక్త జనంతో నగిరి వీధి, నెహ్రూ వీధి నిండిపోయాయి. అనంతరం ఆది దంపతులు నారద పుష్కరిణి, విజ్ఞానగిరి, ఆ తరువాత పురవీధుల్లో ఊరేగి భక్తులకు నవ దంపతులుగా దర్శమిచ్చారు. ఆలయ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు, ఈవో నాగేశ్వరరావు, పూర్వ ఈవో రామారావు తదితరులు పాల్గొన్నారు.

నయనానందకరం... నటరాజ కల్యాణోత్సవం

సకల శాస్త్రాలకు ఆదిగురువైన నటరాజు, శివకామ సుందరి పరిణయోత్సవం సోమవారం రాత్రి ఆద్యంతం రమణీయంగా సాగింది. మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆనందరాత్రిని పురస్కరించుకుని శివకామ సుందరి సమేత నటరాజస్వామికి జరిపిన



మాంగల్యం చూపుతున్న ప్రధాన అర్చకుడు

ఈ కల్యాణోత్సవం సందర్భంగా ఉత్సవమూర్తులను ఆలయ ఆవరణలోని ఆస్థాన మండపానికి ఊరేగింపుగా తీసుకువచ్చారు. ఆలయ అనువంశిక ప్రధాన దీక్షా గురుకుల్ డాక్టర్ స్వామినాథన్ ఆధ్వర్యంలో ఘనంగా పూజాది కార్యక్రమాలు జరిపారు. చివరిగా యాగకలశంలోని పవిత్రజలంతో ఉత్సవ మూర్తులకు విశేష అభిషేకాలు నిర్వహించారు. మేళతాళాలు, భక్తుల జయజయ ధ్వానాలమధ్య ప్రధాన అర్చకులు మాంగల్యధారణ చేపట్టారు. అనంతరం ఉత్సవమూర్తులను పురవీధుల్లో ఘనంగా ఊరేగించారు.సోమవారం ఉదయం ఆదిదంపతులు రుద్రాక్ష చప్పరాలపై పురవిహారం చేశారు.

'లక్‌పతి దీదీ' కింద రూ.150.14 కోట్లు



ప్రశంసా పత్రాలు పొందిన మహిళా సంఘాల సభ్యులతో డీఆర్‌డీఏ పీడీ తులసి

చిత్తూరు (సెంట్రల్), మార్చి 11: ప్రధాన మంత్రి మోదీ 'లక్‌పతి దీదీ' కార్యక్రమంలో భాగంగా సోమవారం దేశవ్యాప్తంగా స్వయం సహాయక సంఘాల సభ్యులతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చిత్తూరులోని కలెక్టరేట్ నుంచి డీఆర్‌డీఏ పీడీ తులసితో పాటు స్వయం సహాయక సంఘాల సభ్యులు హాజరయ్యారు. కేంద్ర ప్రభుత్వ పథకంలో భాగంగా లక్‌పతి దీదీ కార్యక్రమం ద్వారా జిల్లాలోని 1419 స్వయం సహాయక సంఘాల సభ్యులకు రూ.150.14 కోట్లను చెక్కుల రూపంలో పీడీ అందించారు. జీవనోపాధులను ఎంచుకుని ఆర్థికంగా స్థిరపడిన మహిళా సభ్యులకు ప్రశంసాపత్రాలు అందజేశారు.

నోడల్ అధికారులకు ఎన్నికలపై కలెక్టర్ దిశానిర్దేశం

చిత్తూరు (సెంట్రల్), మార్చి 11: కమిషన్ నిబంధనల మేరకు సార్వత్రిక ఎన్నికల విధులను నిర్వహించాలని జిల్లా కలెక్టర్ షన్మోహన్ పేర్కొన్నారు. సోమవారం డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో జేసీ శ్రీనివాసులుతో కలిసి సార్వత్రిక ఎన్నికలకు ఏర్పాట్లు చేసిన విభాగాల నోడల్ అధికారులతో సమావేశం నిర్వహించి పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల విభాగాల్లో భాగంగా మీడియా మేనేజ్‌మెంట్, ఎంసీఎంసీ, సోషల్ మీడియా యూనిట్లు, కాంప్లెయింట్, మానిటరింగ్ సెల్, 1950 కాల్ సెంటర్, ఎన్‌ఎస్‌జీపీ యూనిట్, ఎంసీసీ మానిటరింగ్ యూనిట్ తదితర విభాగాల నోడల్ అధికారులకు ఎన్నికల కోడ్ సమయంలో నిర్వహించాల్సిన విధులపై వివరించారు. విభాగాల నోడల్ అధికారులు నియోజకవర్గాల సిబ్బందితో సమన్వయం చేసుకోవాలని సూచించారు. నివేదికలను నిర్దేశిత కాలంలో తప్పని సరిగా పంపాలని, ఎలాంటి నిర్లక్ష్యం చేయరాదని హెచ్చరించారు. సమావేశంలో నోడల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అడవిలో యువకుడి హత్య

పలమనేరు, మార్చి 11: పలమనేరు సమీపంలోని ఆంజనేయస్వామి ఆలయ అటవీ ప్రాంతంలో పెద్దపంజాణి మండలం శివాడి గ్రామానికి చెందిన వినయ్(30) దారుణ హత్యకు గురయ్యాడు. పోలీసుల కథనం మేరకు ... ఈనెల 8వ తేదీ అర్ధరాత్రి సమయంలో పలమనేరు మండలం బోడిరెడ్డిపల్లికి చెందిన వివాహిత, కొలమాసపల్లి పంచాయతీ కూరుమాయి గ్రామానికి చెందిన యువకుడు ఆంజనేయస్వామి ఆలయ సమీపంలోని అటవీ ప్రాంతానికి వెళ్లారు. అదే సమయంలో వినయ్ కూడా ఆ ప్రాంతంలోనే తిరుగుతూ వీరిద్దరిని చూశాడు. వినయ్ తన వద్ద ఉన్న బీరు బాటిల్‌తో యువకుడిపైకి దాడి చేసేందుకు ప్రయత్నించినట్లు తెలిసింది. రాత్రివేళ ఒంటరిగా వెళ్తున్నందున తన రక్షణ కోసం కూరుమాయి గ్రామానికి చెందిన యువకుడు తన వెంట తీసుకు వెళ్లిన ఇనుపరాడ్‌తో వినయ్‌పై దాడిచేయగా, యువకుడి వెంటవెళ్లిన వివాహిత కూడా ఈ దాడిలో పాల్గొనడంతో వినయ్ తలకు బలమైన గాయాలు తగిలి అక్కడికక్కడే చనిపోయాడు. వివాహితతోపాటు కూరుమాయి యువకుడు పారిపోయారు. వినయ్ హత్యకు గురైన విషయం సోమవారం వెలుగులోకి రావడంతో పోలీసులు రంగప్రవేశం చేశారు.కాగా శనివారం రాత్రి హత్యానంతరం వివాహితతో కలిసి కూరుమాయి యువకుడు పారిపోవడంతో వివాహిత భర్త తన భార్య కనిపించడం లేదని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై పోలీసులు ఆరా తీయడంతో కూరుమాయి యువకుడితో ఉన్న సాన్నిహిత్యంతో వీరిద్దరూ వినయ్‌ను హత్యచేసి పారిపోయినట్టు నిర్ధారించుకున్నట్లు తెలిసింది. సీఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చోరీ కేసులో నిందితుడికి మూడేళ్ల జైలు శిక్ష

చిత్తూరులీగల్, మార్చి 11: దొంగతనం కేసులో నిందితుడికి మూడేళ్ల జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. బంగారుపాళ్యం మండలం ఊటువంక గ్రామానికి చెందిన గిరి ఇంట్లో 2023 ఫిబ్రవరిలో తమిళనాడు రాష్ట్రం మదినేపల్లెకు చెందిన మురళి బంగారు నగల దొంగతనం చేశాడు. దీనిపై బంగారుపాళ్యం పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసు సోమవారం ప్రిన్సిపల్ జూనియర్ జడ్జి కోర్టులో వాయిదా ఉండింది. కేసు పూర్వాపరాలు పరిశీలించాక మురళిపై నేరం రుజువుకావడంతో న్యాయమూర్తి ఉమాదేవి మూడేళ్ల జైలు శిక్ష, రూ.వంద జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

టీడీపీ రాష్ట్ర కార్యదర్శి జన్మదిన వేడుకలు

చంద్రగిరి, మార్చి11: టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వీరపల్లి హేమాంబరధరరావు జన్మదిన వేడుకలు సోమవారం తిరుపతిలో ఘనంగా జరిగాయి. చిన్నారుల మధ్య జరిగిన ఈ వేడుకల్లో పలువురు టీడీపీ నాయకులు పాల్గొని హేమాంబరధరరావుకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం చిన్నారులతో కేక్ కట్ చేయించి అందరికీ పంచిపెట్టారు. చంద్రగిరి మండల టీడీపీ అధ్యక్షుడు సుబ్రమణ్యం నాయుడు, నాయకులు గౌస్‌బాషా, ముండ్లూరి బాలకృష్ణమూర్తి, నగరం రమేష్ తదితరులు పాల్గొన్నారు.



బాల మేధావులే.. భావి శాస్త్రవేత్తలు

- గంగవరంలో 'రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ మనక్' ప్రారంభం





రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ మనక్‌ను ప్రారంభిస్తున్న అధికారులు - నమూనాలను తిలకిస్తున్న విద్యార్థులు

గంగవరం, మార్చి 11: నేటి బాల మేధావులే రేపటి భావితరాల శాస్త్రవేత్తలని డీఈవో దేవరాజులు పేర్కొన్నారు. గంగవరం సమీపంలోని మదర్ థెరీసా కళాశాలలో 'రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ మనక్' ఎగ్జిబిషన్‌ను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సోలార్ సిస్టమ్, రోడ్ల మరమ్మతులు, వాతావరణ కాలుష్య నివారణకు మార్గాలు, పలు యాంత్రీకరణ నమూనాలతో వివిధ జిల్లాల విద్యార్థులు ఆకట్టుకున్నారన్నారు. 23 జిల్లాల నుంచి 306 బృందాలు ఈ ఎగ్జిబిషన్‌కు వచ్చినట్లు చెప్పారు. ఈ ప్రయోగాలను వీక్షించిన విద్యార్థులు టెక్నికల్ పాయింట్స్ తెలుసుకొని సరికొత్త ప్రయోగాలతో దేశానికి ఉపయోగపడేలా తయారుకావాలని పిలుపునిచ్చారు. న్యాయ నిర్ణేతలు ఎంపిక చేసిన నమూనాలకు బహుమతులు, ప్రశంసా పత్రాలు ప్రదానం చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో వెంకటరమణారెడ్డి, డీవైఈవో చంద్రశేఖర్, ఎంఈవోలు వేణుగోపాల్, శ్రీనివాసులు, మునెప్పమొదలి, పరశురామ్‌తోపాటు పలు జిల్లాల అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తిరుపతి నుంచి పలు రైళ్ల రద్దు

తిరుపతి సెంట్రల్, మార్చి11 : తిరుపతి రైల్వేస్టేషన్‌లో ఆధునికీకరణ పనుల కారణంగా సోమవారం నుంచి పలు రైళ్లు రద్దు చేసినట్లు, మరికొన్ని దారి మళ్లించినట్లు రైల్వే అధికారులు వెల్లడించారు. వాటి వివరాలు ఇలా ఉన్నాయి..

- పాండిచ్చేరి-తిరుపతి మధ్య నడుస్తున్న (16112-16111)రైళ్లను ఈనెల 24వ తేదీ వరకు రద్దు చేశారు.
- తిరుపతి-మంగళూరు మధ్య నడుస్తున్న వారాంతపు రైలును (174070) ఈనెల 15 వరకు రద్దు చేశారు.
- తిరుపతి-అరక్కోణం మధ్య నడిచే (06753-06754), చెన్నై-తిరుపతి మధ్య నడుస్తున్న (06728-06727) ప్రత్యేక రైళ్లను తిరుపతి నుంచి రేణిగుంట మధ్య 14వ తేదీ వరకు రద్దు చేశారు.
- తిరుపతి-చెన్నై మధ్య నడుస్తున్న రోజువారి ఎక్స్‌ప్రెస్‌లు(16057-16058, 16054-16053) 23వ తేదీ వరకు రద్దు చేశారు. ఈ నాలుగు రైళ్లు రేణిగుంట-చెన్నై మధ్య రాకపోకలు సాగిస్తాయి.
- నిజాముద్దీన్-త్రివేంద్రం మధ్య నడుస్తున్న ఎక్స్‌ప్రెస్(12644) ఈ నెల 15 నుంచి 22వ తేదీ వరకు తిరుపతికి రాకుండా రేణిగుంట నుంచి అరక్కోణం, కాట్పాడి మీదుగా రాకపోకలు సాగిస్తుంది.
- నిజాముద్దీన్-ఎర్నాకులం ఎక్స్‌ప్రెస్(12646) మంగళవారం నుంచి 19వ తేదీ వరకు రేణిగుంట, అరక్కోణం, కాట్పాడి మీదుగా రాకపోకలు సాగిస్తుంది.
- బెంగళూరు నుంచి టాటానగర్, హటియాల మధ్య నడుస్తున్న ఎక్స్‌ప్రెస్‌లు 21వ తేదీ వరకు రేణిగుంట, అరక్కోణం, కాట్పాడి మీదుగా నడుస్తాయి.
- కాచిగూడ-మధురై మధ్య నడిచే ఎక్స్‌ప్రెస్(07191) ఈ నెల 18వ తేదీ వరకు రేణిగుంట, అరక్కోణం, కాట్పాడి మీదుగా నడుస్తుంది.

పోలీసు స్పందనకు 30 వినతులు

చిత్తూరు, మార్చి 11: చిత్తూరు నగరంలోని ఏఆర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన 'స్పందన' కార్యక్రమానికి 30 వినతులు వచ్చాయి. ప్రజల సమస్యలను విని వారి నుంచి ఏఎస్పీ అరీఫుల్లా అర్జీలను స్వీకరించారు. అధికారుల దృష్టికి వచ్చిన ఫిర్యాదులను నిర్దేశించిన గడువులోగా పరిష్కరించాలని ఆయన ఆదేశించారు.



బాధితుల సమస్యలను వింటున్న ఏఎస్పీ అరీఫుల్లా

స్పందనకు వచ్చిన సమస్యల్లో.. భూ తగాదాల కింద 11, కుటుంబ తగాదాలు 8, డబ్బు తగాదాలు 4, దారి తగాదాలు 4, వేధింపులు 2, ఇంటి తగాదా కింద ఒకటి వంతున ఉన్నాయి. దిశ డీఎస్పీ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

సర్పంచుల పోరుబాట

- పంచాయతీరాజ్ చాంబర్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడి

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 11: ఏపీ సర్పంచుల సంఘం, ఏపీ పంచాయతీరాజ్ ఛాంబర్ ఆధ్వర్యంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా సర్పంచులు పోరుబాట పట్టారు. తమ 16డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్‌చేస్తూ సోమవారం భారీ ర్యాలీగా తిరుపతి కలెక్టరేట్‌కు చేరుకుని ఆందోళనకు దిగారు.జగన్ ఓడితేనే మన మనుగడ అనే నినాదంతో అన్ని పార్టీలకు చెందిన సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, కౌన్సిలర్లు, ఎంపీపీలు వైసీపీ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపడానికి కృషి చేయాలని పంచాయతీరాజ్ ఛాంబర్ అధ్యక్షుడు వైవీబీ రాజేంద్ర ప్రసాద్ ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. మన విధులు, నిధులు దోచేసిన జగన్‌రెడ్డి ప్రభుత్వాన్ని ఓడించండని కోరుతూ సర్పంచులు ఇంటింటికి తిరుగుతూ ప్రచారం చేయాలన్నారు.పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సింగంశెట్టి సుబ్బరామయ్య,జిల్లా పంచాయతీరాజ్ ఛాంబర్ అధ్యక్షుడు ధనంజయయాదవ్ మాట్లాడుతూ సర్పంచులకు తెలియకుండా వారి ఖాతాల్లో నిధులను జగన్ ప్రభుత్వం దొంగలించిందని.. దీంతో గ్రామాల్లో బ్లీచింగ్ చల్లడానికి కూడా డబ్బుల్లేవని ఆవేదన వ్యక్తం చేశారు. జగన్‌ను ఓడించి గ్రామాల అభివృద్ధికి తోడ్పాటునందించే సీఎంను ఎన్నుకుందామన్నారు. సిద్ధం అనే నినాదంతో ఎన్నికల ప్రచారానికి వచ్చిన జగన్



తిరుపతి కలెక్టరేట్ వద్ద పంచాయతీరాజ్ ఛాంబర్ ఆధ్వర్యంలో సర్పంచుల ఆందోళన

గడచిన మూడేళ్లుగా సర్పంచుల ఆందోళన చేస్తుంటే చర్చలకు మాత్రం సిద్ధం కాలేదని విమర్శించారు.సర్పంచుల సంఘం 16 డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని లేనిపక్షంలో ఆందోళనను మరింత ఉధృతం చేస్తామన్నారు. అనంతరం జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్‌కు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ప్రతాపరెడ్డి, ప్రకాష్‌నాయుడు, చింతా కిరణ్‌యాదవ్, జనార్దన గౌడ్, రాము, మురళి, కొత్తపు మునిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బెంగళూరు, రాజమండ్రికి ప్రత్యేక బృందాలు..

బాలుడి కిడ్నాప్ కేసులో ముద్దాయికి రిమాండ్

తిరపతి(నేరవిభాగం), మార్చి11 : తిరుమలలో మూడేళ్ల బాలుడి కిడ్నాప్ కేసులో నిందితురాలు ఇజ్జాడ దేవికి తిరుపతి రెండవ అదనపు మున్సిఫ్ మెజిస్ట్రేట్ 14 రోజుల రిమాండ్ విధించినట్లు తిరుమల టూటౌన్ సీఐ సత్యనారాయణ చెప్పారు. ఈమెపై గతంలో ఏమైన కేసులు ఉన్నాయా? నేర చరిత్ర ఏమైనా ఉందా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఆమె భర్త మధు బెంగళూరులోని ఒక బేకరీలో పనిచేస్తున్నాడు. అతన్ని విచారించడానికి బెంగళూరుకు ప్రత్యేక బృందాలు వెళ్లాయి. మరోవైపు ఆమె ఉంటున్న రాజమండ్రి, రాజానగరంలో ఇతరత్రా వివరాలు తెలుసుకోవడానికి ప్రత్యేక బృందాలను పంపారు.

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌కు ఉజ్వల భవిష్యత్తు

- ఉన్నత విద్యామండలి చైర్మన్ హేమచంద్రరెడ్డి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 11: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌కు ఉజ్వల భవిష్యత్తు ఉందని రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ హేమచంద్రరెడ్డి పేర్కొన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అంశంపై పద్మావతి మహిళా యూనివర్సిటీలో సోమవారం నిర్వహించిన అంతర్జాతీయ సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యా రంగంలోనూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌కు ప్రాముఖ్యత పెరిగిందన్నారు. ఇందులో ప్రతిభ గల విద్యార్థులకు ఉన్నత ఉపాధి అవకాశాలు లభించే అవకాశం ఉంటుందని అభిప్రాయపడ్డారు. విద్యాసంస్థలు విద్యార్థులకు విధిగా బోధించి వారి ప్రతిభకు మెరుగులుదిద్దే విషయంపై దృష్టి సారించాలని కోరారు. ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ ఉమామహేశ్వరిదేవి మాట్లాడుతూ విద్యారంగంలో ఎన్నో మార్పులు వస్తున్నాయని, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ బోధనాంశంగా మారడమే నిదర్శనమని అన్నారు. పద్మావతి వర్సిటీ వీసీ ప్రొఫెసర్ భారతి మాట్లాడుతూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై



హేమచంద్రరెడ్డిని సన్మానిస్తున్న వీసీ భారతి, రిజిస్ట్రార్ రజని

అంతర్జాతీయ సదస్సుకు యూనివర్సిటీ వేదిక కావడం మంచి పరిణామమన్నారు. రిజిస్ట్రార్ రజని మాట్లాడుతూ ఈ అంశంపై అర్థవంతమైన చర్చ సాగి, మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో యూఎస్‌ఏకి చెందిన జినామిక్స్ బయోటెక్ ప్రతినిధి అలోక్ పాండే, మలేషియా యూనివర్సిటీ ప్రతినిధి హసీనా కరీమా, సదస్సు నిర్వాహకులు ఉష, భార్గవి పాల్గొన్నారు.

వీఆర్వో అక్రమాలు అరికట్టండి

●స్పందనలో ఆర్డీవోకు మాజీ ఎమ్మెల్యే ఫిర్యాదు

మదనపల్లె టౌన్, మార్చి 11: మదనపల్లె పట్టణం బీకేపల్లెలో పనిచేస్తున్న వీఆర్వో అక్రమాలను అరికట్టి పేదలకు న్యాయం చేయాలని టీడీపీ నేత, మాజీ ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ఆర్డీవో హరిప్రసాద్‌కు లేఖ ద్వారా ఫిర్యాదు చేశారు. సోమవారం స్థానిక సబ్‌కలెక్టరేట్‌లో స్పందన కార్యక్రమంలో షాజహాన్‌బాషా లేఖలో..తాను బీకేపల్లెలో పర్యటించినప్పుడు అక్కడి ప్రజలు తమ గోడు విన్నవించుకున్నారన్నారు. అక్కడ వీఆర్వోగా పని చేస్తున్న వరలక్ష్మి ఆమె భర్త ద్వారా ప్రభుత్వ భూములు విక్రయించారని ఆరోపించారు. అంతే కాకుండా విద్యుత్ మీటర్ల కు నో అబ్జెక్షన్ సర్టిఫికేట్ మంజూరుకు కూడా ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోందని ఈ విషయాలపై విచారించి న్యాయం చేయాలని లేఖలో కోరారు. కాగా ఆర్డీవో హరిప్రసాద్ సెలవులో ఉండటంతో డిప్యూటీ తహసీల్దార్ కుమారి, డిప్యూటీ సర్వేయర్ కృష్ణమూర్తి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఎక్కువగా భూ సమస్యలపై ప్రజలు అర్జీలు అందజేశారు. వాటిని సంబంధిత అధికారులకు పంపి క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కారం చూపాలని ప్రజలు కోరారు.

నీటి సమస్య తలెత్తకుండా చూడండి

మదనపల్లె, మార్చి 11: పట్టణ పరిధిలో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని మున్సిపల్ చైర్‌పర్సన్ వి.మనూజ, కమిషనర్ కె.ప్రమీల, ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. స్పందనలో వచ్చే ఫిర్యాదులు, వినతులపై ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని వారు సూచించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సోమవారం జరిగిన స్పందనలో ఒకటి, రెండో వార్డులకు సంబంధించిన అమ్మచెరువుమిట్ట, హమాలీకాలనీ, చంద్రాకాలనీ, అనపగుట్ట, ముజీబ్‌నగర్, తదితర ప్రాంతాల్లో తాగునీటి సమస్య, శానిటేషన్ సమస్య పరిష్కరించాలని, రోడ్లు, కాలువలు నిర్మించాలని, వీధిలైట్లు ఏర్పాటు చేయాలని, తదితర అంశాలపై స్థానికులు వినతిపత్రాలు అందజేశారు. అలాగే బాధితులు నేరుగా కొందరు, మరికొందరు ఫోన్ ద్వారా సమస్యలను చైర్‌పర్సన్, కమిషనర్‌కు విన్నవించారు. వాటిపై ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. అలాగే జగనన్న ఇల్లు, పట్టాలు మంజూరు చేయాలని, ఇప్పటికే ఇచ్చిన వాటికి స్థలాలు చూపించాలని కొందరు, చూపిన స్థలం నిర్మాణానికి అనుకూలంగా లేదని మార్చి మరోచోట ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ శివయ్య, డీఈ శ్రావణి, ఏఈలు స్నేహప్రియ, బి.శిరీష, తదతరులు పాల్గొన్నారు.

దాడి కేసులో ఒకరి అరెస్టు

పెద్దమండ్యం, మార్చి 11: ఓ వ్యక్తిపై కత్తితో దాడి కేసులో సోమవారం ఒకరిని అరెస్టు చేసినట్లు పెద్దమండ్యం ఎస్ఐ చెన్నకేశవ తెలిపారు. పెద్దమండ్యం గ్రామ పరిధిలోని బురుజు కురవపల్లికు చెందిన లక్ష్మీపతి(23)పై గెల్లువారిపల్లి కు చెందిన శ్రీకాంత్(19) కత్తితో శనివారం రాత్రి దాడి చేశాడు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన లక్ష్మీపతిని 108 వాహనంతో మదనపల్లి జిల్లా ప్రభుత్వాసుపత్రికి అటు నుంచి ఆరోగ్య పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించారు. ఆదివారం బాధితుడి తల్లి భూదేవి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులోని నిందితుడు శ్రీకాంత్‌ను సోమవారం అరెస్టు చేసి తంబళ్లపల్లి కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రభుత్వాస్పత్రికి స్టీల్ గ్లాసులు వితరణ

మదనపల్లె టౌన్, మార్చి 11: మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి దాతలు రూ.9వేలు విలువ చేసే 300 స్టీల్ గ్లాసులను వితరణగా అందజేశారు. సోమవారం స్థానిక ప్రభుత్వాస్పత్రి ఎంఎస్ డాక్టర్ పద్మాంజలి దేవి, ఆర్ఎంవో డాక్టర్ ప్రసాదరాజును కలసిన సాయిచిత్ర భాస్కర్, జడ్పీ హెచ్ఎం తిరుమల, వారి కుమారుడు వరుణ్‌లు స్టీలు గ్లాసులను అందజేశారు. తిరుమల తల్లి బోయపాటి సరస్వతమ్మ జ్ఞాపకార్థం ప్రభుత్వాస్పత్రిలో రోగులకు స్టీలు గ్లాసులు పంపిణీ చేశామన్నారు.

7వ ఏడీజే కోర్టు ఏపీపీగా జయనారాయణ రెడ్డి



మదనపల్లె టౌన్, మార్చి 11: మదనపల్లె 7వ అదనపు జిల్లా, సెషన్స్ కోర్టు అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా మదనపల్లెకు చెందిన న్యాయవాది వి. జయనారాయణరెడ్డిని నియమిస్తూ డైరెక్టర్ ఆఫ్ ప్రాసెక్యూషన్స్ జె.సుదర్శనరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ క్రమంలో సోమవారం జయనారాయణరెడ్డి ఏపీపీగా బాధ్యతలు చేపట్టారు. మూడేళ్ల పాటు ఆయన అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా విధులు నిర్వహించనున్నారు.

ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలి

నిమ్మనపల్లి, మార్చి 11: దివ్యాంగులకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని సోమవారం డిప్యూటీ తహసీల్దార్ తపస్వినికి వారొక వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో కూడా దరఖాస్తులు సమర్పించినా ఫలితం లేదన్నారు. ఇప్పటి కైనా తమపై దయ వుంచి ఇళ్ల పట్టాలను మంజూరు చేసి వికలాంగుల కాలనీని ఏర్పాటు చేయాలని కోరారు. దీంతో డీటీ స్పదించి సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు.

మైనారిటీల రక్షణ కవచం తెలుగుదేశం

● బీజేపీతో పొత్తుతో ఎటువంటి ఇబ్బంది ఉండదు ● రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా కేంద్ర సహకారం అవసరం ● టీడీపీ నాయకుల వెల్లడి



సమావేశంలో మాట్లాడుతున్న తెలుగుదేశం పార్టీ నాయకులు

పీలేరు, మార్చి 11: బీజేపీతో పొత్తు వల్ల రాష్ట్రంలోని మైనారిటీలకు ఎలాంటి ఇబ్బంది ఉండదని, తమ పార్టీ వారికి రక్షణ కవచంలా ఉంటుందని పీలేరు తెలుగుదేశం పార్టీ నాయకులు పేర్కొన్నారు. పీలేరులోని పార్టీ కార్యాలయంలో సోమవారం వారు విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ బీజేపీతో టీడీపీ పొత్తు పెట్టుకోవడం వల్ల మైనారిటీలకు రక్షణ ఉండదని అధికార వైసీపీ వారు అసత్య ప్రచారం చేస్తున్నారని 1999, 2014లోనూ బీజేపీతో పొత్తులో ఉన్నప్పుడు ఉమ్మడి రాష్ట్రంలో గానీ, విభజిత ఆంధ్రప్రదేశ్‌లోగానీ ఎటువంటి మతఘర్షణలు లేకుండా ప్రశాంత పరిపాలన అందించిన ఘనత టీడీపీదేనన్నారు. ఎన్‌డీఏలో భాగస్వామ్యం కావడం ద్వారా బీజేపీ దేశంలోని మైనారిటీలకు ఇబ్బంది కలిగే నిర్ణయాలు తీసుకోకుండా చంద్రబాబు అడ్డుకోగలరని వారు ధీమా వ్యక్తం చేశారు. చంద్రబాబు ఎన్‌డీఏ కన్వీనర్‌గా ఉన్నప్పుడే మైనారిటీ వర్గానికి చెందిన ఏపీజే అబ్దుల్ కలాంను రాష్ట్రపతి అభ్యర్థిగా నిర్ణయించిన విషయం మైనారిటీలు గుర్తుంచుకోవాలన్నారు. రాష్ట్రంలో జగన్మోహన్‌రెడ్డి విధ్వంసకర పాలన వల్ల ఆంధ్రప్రదేశ్ అప్పులాంధ్రగా మారిపోయిందని దీనిని మళ్లీ గాడిలో పెట్టాలంటే కేంద్ర ప్రభుత్వ సహకారం అనివార్యమని వారు తెలిపారు. రాష్ట్ర ప్రయోజనాల కోసమే తమ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ బీజేపీతో పొత్తుకు అంగీకరించారని వారు తెలిపారు. ప్రజల సొమ్మును జీతాలుగా తీసుకుంటున్న వలంటీర్లను పార్టీ కార్యక్రమాలకు వాడుకుంటూ వారి చేత ప్రజలకు తాయిలాలు పంపిణీ చేయించడం దారుణమన్నారు. కార్యక్రమంలో నాయకులు కోటపల్లె బాబురెడ్డి, వారణాశి శ్రీకాంత్ రెడ్డి, మల్లెల రెడ్డిబాషా, పురం రామ్మూర్తి, పోలిశెట్టి సురేంద్ర, కంచి సూరి, రెడ్డిముని, అబ్బవరం సురేశ్, పురుషోత్తం రెడ్డి, షౌకత్‌అలీ, ఖాదర్, వెంకటరమణ నాయక్, వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు, పవన్ చిత్రపటాలకు క్షీరాభిషేకం



మాట్లాడుతున్న రాజంపేట పార్లమెంటు సగర సాధికార కమిటీ కన్వీనర్ వేణుగోపాల్

ములకలచెరువు, మార్చి 11: మండలంలోని ఎర్రంరెడ్డిగారిపల్లెలో సోమవారం సగర కులస్థుల ఆధ్వర్యంలో టీడీపీ, జనసేన పార్టీల అధినేతలు చంద్రబాబునాయుడు, పవన్‌కళ్యాణ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఇటీవల ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌లో సగర కులస్థులకు అధిక ప్రాధాన్యత కల్పించడంతో హర్షం వ్యక్తం చేస్తూ కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో రాజంపేట పార్లమెంటు నియోజకవర్గ సగర సాధికార సమితి కన్వీనర్ తాళ్లపాక వేణుగోపాల్, మీడియా కోఆర్డినేటర్ కట్టా హరినాథ్, తంబళ్లపల్లె నియోజకవర్గ నాయకులు నాగరాజు, లక్ష్మీనారాయణ, అర్జున, గుర్రప్ప, శంకర పాల్గొన్నారు.

ఎన్నికల బాండ్ల వివరాలను ప్రకటించాలి

మదనపల్లె అర్బన్, మార్చి 11: ఎన్నికల బాండ్ల వివరాలను ఎస్బీఐ ప్రకటించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. సోమవారం ఎలక్టోరల్ బాండ్ల వివరాలను వెల్లడించకుండా మోదీ ప్రభుత్వం కుట్ర పడుతోందంటూ ఎస్బీఐ మెయిన్ బ్రాంచ్ వద్ద సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ ఎన్నికల బాండ్ల రాజ్యాంగ విరుద్ధమని, ఆ సమాచారం అందజేయాలని సుప్రీంకోర్టు ఆదేశించడం జరిగిందన్నారు. ఆ తీర్పునకు అనుగుణంగా బాండ్లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు హరిశర్మ, సాహిన, ఉషారాణి, వెంకటలక్ష్మి, కుమారి, తదితరులు ఉన్నారు.

మండల సమస్యలపై సభ్యుల ఏకరువు

రామసముద్రం, మార్చి 11: సమస్యల పరిష్కారానికి ప్రభుత్వ అధికారులు చొరవ చూపడం లేదంటూ మండల సమావేశంలో సభ్యులందరూ అధికారుల తీరుపై ఏకరువు పెట్టారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం జరిగిన సర్వసభ్య సమావేశంలో అధికార పార్టీకి చెందిన ఎంపీటీసీలు, సర్పంచ్‌లు మాట్లాడుతూ గత రెండుమూడు సర్వసభ్య సమావేశాల నుంచి సమస్యలు అధికారుల దృష్టికి తెచ్చినా అవి పరిష్కారానికి నోచుకోలేదన్నారు. మండలంలోని మట్లవారిపల్లె హైస్కూల్‌లో నాడు-నేడు పనులు నత్తనడకన సాగుతున్నాయని, ఎంపీటీసీ రెడ్డెప్ప ఆరోపించారు. మండల కేంద్రం నుంచి ఆర్.నడింపల్లె, నల్లప్పగారిపల్లె, శ్రీరాముల పల్లె తదితర ఆరు గ్రామాల మీదుగా మదనపల్లెకు ఆర్‌టీసీ బస్సు వేయాలని మూడేళ్లుగా అడుగు తున్నా బస్సు వేయలేదని ఎంపీటీసీ రెడ్డిచంద్రశేఖర్ పేర్కొన్నారు.

పంచాయతీకి రూ.13.36 లక్షల ఆదాయం

గుర్రంకొండ, మార్చి 11:గుర్రంకొండ పంచాయతీకి వేలం పాటల ద్వారా రూ.13.36 లక్షల ఆదాయం వచ్చినట్లు డీఎల్పీవో నాగరాజు తెలిపారు. గుర్రంకొండ పంచాయతీ పరిధిలోని సంత నిర్వహణ, బస్టాండు నిర్వహణకు సోమవారం వేలం పాటలను నిర్వహించారు. ఇందులో భాగంగా సంత నిర్వహణను వేలం పాటలో రూ.10.30 లక్షలకు సత్తార్‌ఖాన్, బస్టాండు నిర్వహణను వేలంపాటలో రూ.3.06 లక్షలకు విజయ్‌కుమార్ కాంట్రాక్ట్ దక్కించుకున్నారు.

విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ

మదనపల్లె అర్బన్, మార్చి 11: స్థానిక నీరుగట్టువారిపల్లెలోని సాయి విద్యానికేతన్‌లో పదో తరగతి విద్యార్థులకు ధాత్రి ఫౌండేషన్ ఆధ్వర్యంలో టూటౌన్ సీఐ యువరాజు చేతుల మీదుగా విద్యాసామగ్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ శ్రీనివాస్, ధాత్రి ఫౌండేషన్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఒక్కచాన్స్‌తో వైసీపీ రాష్ట్రాన్ని దోచుకుంది

● చంద్రబాబుతోనే రాష్ట్ర భవిష్యత్తుకు గ్యారంటీ

● టీడీపీ అభ్యర్థి దాసరిపల్లి జయచంద్రారెడ్డి



బోయపాపన్నగారిపల్లెలో టీడీపీ అభ్యర్థి జయచంద్రారెడ్డి సమక్షంలో టీడీపీలో చేరిన గ్రామస్థులు

ములకలచెరువు, మార్చి 11: ఒక్క అవకాశం పేరుతో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని దోచుకుని చీకట్లోకి నెట్టిందని తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి దాసరిపల్లి జయచంద్రారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని మద్దినాయనిపల్లె పంచాయతీ వెంగన్నగారిపల్లె, బూడిదగడ్డ, పొట్నింగన్నగారిపల్లె, ఎనమలవారిపల్లె, దాదంవారిపల్లె, బస్సయ్యగారిపల్లె, ఎర్రంరెడ్డిగారిపల్లె తదితర గ్రామాల్లో సోమవారం బాబు ష్యూరిటీ.. భవిష్యత్తు గ్యారంటీ పథకాలపై ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి ప్రభుత్వం ఏర్పాటు ఖాయమన్నారు. కార్యక్రమాల్లో టీడీపీ మండల అధ్యక్షుడు పాలగిరి సిద్ధా, జనసేన నియోజకవర్గ ఇన్ చార్జి పోతుల సాయినాథ్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు సురేంద్ర యాదవ్, రాష్ట్ర అధికార ప్రతినిధి గుత్తికొండ త్యాగరాజు, నేతలు కేవీ రమణ, ఎర్రగుడి సురేష్, చెన్నకిష్టా, కేశవులు, ముత్తుకూరు మౌళా, రమణారెడ్డి, మస్తాన్‌రెడ్డి, మూగి రవిచంద్ర, చెన్నకేశవ, శ్రీనివాసులు, శంకర తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలోకి భారీగా చేరికలు

మండలంలోని మద్దినాయనిపల్లె పంచాయతీలో సోమవారం జరిగిన కార్యక్రమంలో వైసీపీ నుంచి టీడీపీ అభ్యర్థి దాసరిపల్లి జయచంద్రారెడ్డి సమక్షంలో భారీగా టీడీపీలో చేరారు. బోయపాపన్నగారిపల్లెకు చెందిన నరసింహులు, రామాంజులు, శ్రీనివాసులు, సుధాకర, సుమిత్ర, సుమలత, నరసమ్మ, అంజలి, నీలమ్మ తదితర 30 కుటుంబాలకు చెందిన వారు టీడీపీలోకి చేరాయి. అలాగే సెంట్రల్ స్కూల్ పంచా యతీ నల్లచెరువుపల్లెకు చెందిన జగదీశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో 20 మంది టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు.

ప్రజలు నిర్భయంగా ఓటెయ్యండి



అంగళ్ళులో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

కురబలకోట, మార్చి 11: ప్రజాస్వామ్యంలో ప్రజలు నిర్భయంగా ఓటెయ్యాలని డీఎస్పీ ప్రసాద్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం మండలంలోని అంగళ్ళులో సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో జరగనున్న ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో జరిగేలా చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. ఎన్నికల నిర్వహణకు ప్రజాప్రతినిధులు, ప్రజలు సహకరించాలని, ఎవరైన శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టపరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇప్పటికే రౌడీషీటర్లను బైండోవర్ చేసుకున్నామన్నారు. కార్యక్రమంలో సీఐ సద్గురు, ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికలకు పకడ్బందీ చర్యలు

ములకలచెరువు, మార్చి 11: సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు పకడ్బందీ చర్యలు చేపట్టినట్లు సీఐ మధు, ఎస్ఐ తిప్పేస్వామి పేర్కొన్నారు. మండలంలోని కనికలతాండా, గుత్తావారిపల్లె తాండాల్లో సోమవారం ఎస్ఎస్‌బీ బలగాలతో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. అనుమానిత వ్యక్తుల ఇళ్ళను, చుట్టుపక్కల ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. అలాగే చౌడసముద్రంలో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘనలు చోటు చేసుకోకుంగా చర్యలు తీసుకున్నామన్నారు.

కేంద్ర బలగాలతో కవాతు



నిమ్మనపల్లి, మార్చి 11: ఎన్నికల నిర్వహణ దగ్గర పడుతుండడంతో కేంద్ర బలగాలు ఎస్ఐ లోకేష్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం పలు ప్రాతాలలో కవాతు నిర్వహించారు. కేద్రంలోని ఎస్ఎస్‌బి బలగాలు మండలంలోని రాచవేటివారిపల్లి, పెద్దమాదిగపల్లి, నిమ్మనపల్లి పరిసర ప్రాంతా లలో కవాతు నిర్వహిచారు. ఎస్ఐ లోకేష్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికలు పూర్తయ్యేంత వరకు కేంద్ర బలగాలు అందుబాటులో ఉం టాయ న్నారు.

రామసముద్రంలో: సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా మండల కేంద్రంలో సోమవారం సీఐఎస్ఎఫ్ కేంద్ర పోలీస్ బలగాలతో కవాతు నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ రాబోయే ఎన్నికల దృష్ట్యా మండలంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఓటర్లు నిర్భయంగా నచ్చిన వారికి ఓటు వేసుకోవడానికి తగిన జాగ్రత్తలు తీసుకుంటామన్నారు. చెంబకూరు, మండల కేంద్రంలో దిగువపేట నుంచి ఎగువ చెక్‌పోస్ట్ వరకు ఫ్లాగ్‌మార్చ్ ర్యాలీ నిర్వహించారు.

పోలింగ్ కేంద్రాల్లో వసతుల పరిశీలన

కలకడ, మార్చి 11:మండలంలోని పోలింగ్ కేంద్రాల్లో వసతులను జేసీ ఫర్మాన్‌అహ్మద్ ఖాన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన బాలయ్యగారిపల్లె, కలకడ, బాటవారిపల్లె, గంగాపురం, కె.దొడ్డిపల్లె, ఎర్రకోటపల్లె గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ ప్రియదర్శిని, సెక్టోరియల్ అధికారులు రామచంద్రారెడ్డి, స్వర్ణలత, లతీఫ్‌ఖాన్, కీర్తన, బీఎల్వోలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో త్రిశూల స్నానం

కలకడ, మార్చి 11:కలకడ సత్యవతి నది తీరాన వెలసిన కామాక్షి సమేత సిద్దేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం త్రిశూల స్నానం కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఇందులో భాగంగా త్రిశూలానికి ఆలయం ఎదుట ఉన్న పుష్కరిణిలో జలాభిషేకం చేశారు. ఆలయ ధర్మకర్త అఖిలేష్, కమిటీ సభ్యులు మద్దిపట్ల వెంకటరమణ నాయుడు, శ్రీనివాసులునాయడు, రెడ్డెప్ప నాయుడు, జి.కుమార్‌నాయుడు, రామయ్యచౌదరి, పాల్గొన్నారు.

29న కుంభాభిషేకం

మదనపల్లె అర్బన్, మార్చి 11: పట్టణ సమీపంలోని మడిక య్యల శివాలయంలో ఈ నెల 29 నుంచి కుంభాభిషేకం నిర్వహిస్తున్నట్లు ఈవో రమణ పేర్కొన్నారు. సోమవారం మీడియాతో ఆయన మాట్లాడుతూ ఈ కుంభాభిషేక ఉత్సవాలకు జగద్గురు కంచి కామకోటి పీఠాధిపతి స్వామి విచ్చేయనున్నట్లు తెలిపారు.

సీనియర్ సిటిజన్స్‌కు ఉచిత వైద్యసేవలు



కంటి పరీక్షలు చేస్తున్న దృశ్యం

మదనపల్లె అర్బన్, మార్చి 11: సీనియర్ సిటిజన్స్‌కు ఉచిత వైద్యసేవలు అవసరమని మాజీ ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అన్నారు. సోమవారం జీఆర్‌టీ స్కూల్లో ఏపీ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి ముఖ్యఅతిధులు గా మాజీ ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, డీఎస్పీ గా పదోన్నతి పొందిన శ్రీనివాసులు పాల్గొన్నారు. వారిని సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ సభ్యులు సన్మానించారు. సీనియర్ సిటిజన్స్‌కు మదనపల్లెకు చెందిన దృష్టి అగర్వాల్ కంటి వైద్యశాల ద్వారా ఇమాన్యుయల్ రాజ్, రాజశేఖర్ కంటి పరీక్షలు నిర్వహించారు.

చీటీల సొమ్ము స్వాహా చేసింది సుధాకర్‌రెడ్డే

●అతనితో నాకు ప్రాణహాని వుంది

● మేనేజర్ కృష్ణారెడ్డి పోలీసులకు ఫిర్యాదు



మదనపల్లెలో మాట్లాడుతున్న చీటీల బాధితులు

మదనపల్లె, మార్చి 11: చీటీల సొమ్ము తాను స్వాహా చేయలేదని, చేసింది సం ఘంలో పెద్దమనిషిగా చెలామణి అవుతున్న వీఎస్‌ఆర్ గ్రాండ్ సుధాకర‌రెడ్డేనని మేనేజర్ కృష్ణారెడ్డి పోలీసులతో పాటు మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నాడు. స్థానిక కదిరి రోడ్డు ఎక్స్‌టెన్షన్ (జిల్లా ప్రభుత్వాసుపత్రి ఎదురుగా వీధి)లోని కృష్ణారెడ్డిని చీటీల బాధితులు ఆదివారం నిలదీసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కృష్ణారె డ్డి..అసలు విషయాలను కుండలు బద్దలు కొట్టాడు. తాను సుధాకర్‌రెడ్డి వద్ద మేనేజర్‌గా గత 22 ఏళ్లుగా పని చేస్తున్నానని, ఇందులోభాగంగా నెలకు రూ.2వేల నుంచి రూ.22 వేల జీతం వరకూ పని చేసినట్లు కృష్ణారెడ్డి పేర్కొన్నారు. ఆయన నిర్వహించే చీటీలు, వడ్డీల డబ్బులు కలెక్షన్ చేసే వాడినని, చీటీల గ్రూపులు పెంచితే ఎక్కువ జీతం ఇస్తానని చెప్పడంతో చీటీలకు ఎక్కువ మందిని జాయిన్ చేసి, గ్రూపులు పెంచి కలెక్షన్ మొత్తం సుధాకర్‌రెడ్డికి ఇచ్చానని తెలిపారు. మొత్తం డబ్బులు సుధాకర్‌రెడ్డి తీసుకుని నింద మాత్రం నాపై వేస్తున్నాడని, ఆ విషయాలన్నీ చీటీ దారులకు తెలుసునన్నారు. సుధాకర్‌రెడ్డిని నమ్మి నేను కలెక్షన్ చేసిన వారు చాలామంది ఉన్నారని, వారందరికీ రూ.4కోట్లు ఇవ్వాలన్నారు. ఈ డబ్బులన్నీ ఆర్టీసీ బస్టాండు సమీపంలోని వీఎస్‌ఆర్ గ్రాండ్ లాడ్జికి, హార్సిలీహిల్స్‌లోని వీఎస్‌ఆర్ విండ్ వేవ్ బిల్డింగ్స్‌కు వాడుకున్నట్లు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో కృష్ణారెడ్డి పేర్కొన్నాడు. తనకు ఏ సమయంలో అయినా ఏమైనా జరగవచ్చని నిందితుడు కృష్ణారెడ్డి ఆందోళన వ్యక్తం చేశాడు. ఈ మేరకు నిందితుడు...డీఎస్పీ ప్రసాద్‌రెడ్డికి ఫిర్యాదుతోపాటు వీడియో, ఆడియో మెసేజ్‌లు పంపించారు. వైసీపీ నాయకుడైన సుధాకర్‌రెడ్డిపై నిందితుడు కృష్ణారెడ్డి చేసిన అభియోగాలు, ఆరోపణలు సోషల్‌మీడియాలో వైరల్ అయ్యాయి. ఇదిలా ఉండగా చీటీల బాధితులు తమకు న్యాయం చేయాలంటూ మదనపల్లె డీఎస్పీని కలిసి వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు.

ఓటమి భయంతో జగన్‌కు వణుకు



అయ్యవారిపల్లెలో ఇంటింటి ప్రచారం చేస్తున్న టీడీపీ- జనసేన నాయకులు

వాల్మీకిపురం, మార్చి 11: రాబోవు ఎన్నికల్లో ఓటమి తప్పదన్న భయం తో సీఎం జగన్‌లో వణుకు పట్టుకుం దని వాల్మీకిపురం మండల టీడీపీ అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని అయ్యవారిపల్లె, చిన్నగంగువారిపల్లెలలో టీడీపీ, జనసేన ఆధ్వర్యంలో బాబు షూరిటీ.. భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఇరుపార్టీల ఉమ్మడి మేనిఫెస్టోలోని సూపర్‌సిక్స్ సంక్షేమ పథకాల కరపత్రాలను ఇంటింటా పంచుతూ ప్రజలకు అవగాహన కల్పించారు. వచ్చే ఎన్నికల్లో నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి భారీ మెజారిటీతో గెలిపించి తమ పార్టీల సత్తా చాటుకుంటామన్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు వెంకటరమణ, మైనార్టీ అధ్యక్షుడు సయ్యద్, నాయకులు రాజేంద్రాచారి, పీవీ నారాయణ, వల్లిగట్ల వెంకటరమణ, చంద్రమౌళి, మురళి, టీడీపీ, జనసేన పార్టీల నేతలు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం కోసం టీడీపీని గెలిపించండి



కలికిరి పట్టణంలో సూపర్ సిక్స్ పథకాల గురించి వివరిస్తున్న తనూజా రెడ్డి

కలికిరి, మార్చి 11: నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి, సంక్షేమం కోసం ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, పీలేరు టీడీపీ అభ్యర్థి నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి సతీమణి తనూజా రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం ఆమె కలికిరి పట్టణంలో ఇంటింటికీ వెళ్లి టీడీపీ ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాల గురించి కరపత్రాలను పంచిపెట్టి వివరించారు. గతంలో అధికారంలో వున్నప్పుడు కిశోర్‌కుమార్ రెడ్డి నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసిన విషయాన్ని గుర్తు చేశారు. అంతకు ముందు స్థానిక గ్రామ దేవత ఎల్లమ్మ ఆలయంలో తనూజా రెడ్డి పూజలు నిర్వహించి ప్రచారం ప్రారంభించారు. ప్రచారంలో ఆమె వెంట ఎంపీటీసీ రెడ్డివారి గాయత్రి, కలికిరి సర్పంచు ప్రతాప్‌కుమార్ రెడ్డి, మండల టీడీపీ అధ్యక్షుడు నిజాముద్దీన్, మహల్ సతీష్ రెడ్డి, చంద్రశేఖర్, మాజీ ఎంపీపీలు నాగభూషణ రెడ్డి, రహంతుల్లా, రమేష్ చెట్టి, కేవీ రెడ్డి, సుధాకర్ రెడ్డి, రెడ్డెప్ప రెడ్డి, వర్మ, ఏఎంసీ బుజ్జి, అఫ్రోజ్, మధు, జ్ఞాన, సమీవుల్లా, కలికిరి మాజీ సర్పంచులు గోపీనాథ్, అంజమ్మ, బీజేపీ నాయకుడు ప్రతాప్‌తోపాటు పెద్ద సంఖ్యలో టీడీపీ మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.

'శంకర్ యాదవ్‌ను తంబళ్లపల్లె అభ్యర్థిగా ప్రకటించండి'

పెద్దతిప్పసముద్రం మార్చి 11 : తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ అభ్యర్థిగా శంకర్‌యాదవ్‌ను ప్రకటించాలని ఆయనకు మద్దతుగా టి.సదుంలో పెద్ద ఎత్తున మహిళలు శాంతియుతంగా నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి పలువురు మహిళలు మాట్లాడుతూ తంబళ్లపల్లె నియోజకవర్గాన్ని శంకర్‌యదవ్ అయితే అన్ని ఈ నిరసన కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ శారద మునిరాజ్, గ్రామానికి చెందిన మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వైసీపీ నేతలు గ్రాఫిక్స్‌తో మోసం చేస్తున్నారు



మేదరమిట్ల సిద్ధం సభ ప్రాంతంలో మాట్లాడుతున్న వెంకటేశ్, మధుబాబు

మదనపల్లె టౌన్, మార్చి 11: సిద్ధం అంటూ సీఎం జగన్ అరుస్తుంటే లక్షలాది మంది వచ్చినట్లు వైసీపీ నాయకులు గ్రాఫిక్స్ ఫొటోలతో ప్రజలను మోసం చేస్తున్నారని పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి ఆర్‌జే వెంకటేశ్, రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి రాటకొండ మధుబాబు ధ్వజమెత్తారు. బాపట్ల జిల్లా మేదరమిట్ల వద్ద ఆదివారం జరిగిన సిద్ధం సభలో పెద్దసంఖ్యలో ప్రజలు వచ్చినట్లు గ్రీన్‌మ్యాట్ కింద పరిచి, గ్రాఫిక్స్‌లో లక్షలాది మంది ప్రజలు వచ్చినట్లు చూపించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో మదనపల్లె నుంచి మేదరమిట్లకు వెళ్లిన ఆర్‌జే వెంకటేశ్, మధుబాబు అక్కడ ఏర్పాటు చేసిన గ్రీన్‌మ్యాట్లు, గ్రాఫిక్స్‌పై స్పందించారు. సిద్ధం సభకు రూ.600 కోట్లు దాకా ప్రజా ధనం దుర్వినియోగం చేశారని, వేలాది బస్సులను సిద్ధం సభకు మళ్లించి ప్రజలను అష్టకష్టాల పాలు చేశారన్నారు. జగన్ మాటలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని స్పష్టం చేశారు.

వైసీపీ నిరంకుశ పాలనకు రోజులు దగ్గర పడ్డాయి



టీడీపీ కార్యాలయంలో మాట్లాడుతున్న పట్టణ అధ్యక్షుడు భవానిప్రసాద్

మదనపల్లె టౌన్, మార్చి 11: రాష్ట్రంలో వైసీపీ నిరంకుశ పాలన అంతమొందిచే రోజులు దగ్గర పడ్డాయని టీడీపీ పట్టణ అధ్యక్షుడు జోళపాలెం భవాని ప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక అన్నమయ్య సర్కిల్‌లోని టీడీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి సూచనలతో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భవాని ప్రసాద్ మాట్లాడుతూ వైసీపీ ఐదేళ్ల పాలనలో ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నం అయిందని, ఈ రాష్ట్రం అప్పుల నుంచి గట్టెక్కాలంటే టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులను ప్రజలు గెలిపించాలన్నారు. వైసీపీ అరాచక పాలనకు అడ్డుకట్ట వేయాలనే టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఏర్పడిందన్నారు. బీసీలు ఎల్లప్పుడు టీడీపీకే మద్దతు పలుకుతున్నారన్నారు. చంద్రబాబు లాంటి దార్శినికుడి పాలన ప్రజలకు ఎంతో మేలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తులసీధర్‌నాయుడు, కత్తి లక్ష్మన్న, మీడియా కోఆర్డినేటర్ వెంకటరమణారెడ్డి, మునిరాజ, దాదావీర్, బావాజాన్ పాల్గొన్నారు.

ఉత్తమ సీడీపీవో సుజాతకు అభినందనలు



సీడీపీవో, సూపర్‌వైజర్లను అభినందిస్తున్న ఐసీడీఎస్ ఉద్యోగులు

మదనపల్లె టౌన్, మార్చి 11: అన్నమయ్య జిల్లా స్థాయిలో ఉత్తమ సీడీపీవోగా మదనపల్లె సీడీపీవోగా అవార్డు అందుకున్న సుజాతకు సహోద్యోగులు అభినందనలు తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సం దర్భంగా జిల్లా స్థాయిలో ఐసీడీఎస్ ప్రాజెక్టులో పనిచేస్తున్న ఉద్యోగులకు ఉత్తమ అవార్డులు అందజేసిన విషయం విదితమే. దీంతో మదనపల్లె సీడీపీవో సుజాత, సూపర్‌వైజర్ చంద్రకాంతలకు సోమవారం మదనపల్లె ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో వారి సహోద్యోగులు పుష్ప గుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలియజేశారు. అలాగే ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఏఎస్ స్పోర్ట్స్ అకాడమిలో మహిళా ఉద్యోగినులకు నిర్వహించిన క్రీడా పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గురుప్రసాద్, వరలక్ష్మి, సరస్వతి, రెడ్డెమ్మ తదితరులు పాల్గొన్నారు.